


భారత్ ప్రతినిధి

తెలుగు దిన పత్రిక








సంపుటి: 3 సంచిక: 317 పేజీలు: 8 సంపాదకులు: రోళ్ళ రఘునాథ్ రెడ్డి ప్రచురణ: గుంటూరు బుధవారం, 09 సెప్టెంబర్ 2026 వెల: 2 రూ/- RNI No: APTEL/2023/88990

VOLUME: 3 ISSUE: 317 PAGES: 8 EDITOR: ROLLA RAGHUNATH REDDY PUBLISHED: GUNTUR WEDNESDAY, 09 SEPTEMBER 2026 PRICE: 2 Rs/- BHARATH PRATHINIDHI




# రూ.35 వేల కోట్ల ప్రాజెక్టులు ప్రారంభం..

- విమర్శకులపై మోడీ 'నారాజ్ ఫూఫాజీ' పంచ్
- ప్రధాని సభా ప్రాంగణంలో భద్రతా వైఫల్యం..
- నకిలీ అధికారి అరెస్ట్, తుపాకీ స్వాధీనం..!

**వడోదర: సెప్టెంబర్ 08:** తన ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రశ్నించే ప్రతిపక్షంపై ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. విమర్శ కులను ఉద్దేశించి ఇటీవల ఉపయోగిస్తున్న 'నారాజ్ ఫూఫాజీ' (కోపంగా ఉన్న మామయ్య) పదాన్ని మరోసారి ప్రస్తావించారు. గుజరాత్‌లోని వడో దరలో మంగళవారం నిర్వహించిన 'నమో ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమంలో రూ.35 వేల కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారం భోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ ప్రాజెక్టుల్లో 2,800 కిలోమీటర్ల పొడవైన డెడికేటెడ్ రైల్ ఫ్రైట్ కారిడార్ కూడా ఉంది. దీనిని 21వ శతాబ్దపు చారిత్రక విజయంగా మోదీ అభివర్ణించారు.బీజేపీ, కాంగ్రెస్ ప్రభు త్వాల పనితీరును పోల్చుతూ ఫ్రైట్ కారిడార్ ప్రాజెక్టును మోదీ ప్రస్తావించారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి మిగతా2లో...

# అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- సోషల్ మీడియాను యాక్టివ్‌గా వాడాలి
- టీడీపీ నేతలకు నారా లోకేశ్ దిశానిర్దేశం

**అమరావతి, సెప్టెంబర్ 08:** తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో రెండో రోజు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నేతలను ఉద్దేశించి కీలక ప్రసంగం చేశారు. 'పొలిటికల్ కమ్యూనికేషన్ అండ్ పబ్లిక్ ఓరియంటేషన్' అనే అంశంపై మాట్లాడుతూ, ఆయన నేరుగా సభికులను "మీలో ఎంతమంది సోషల్ మీడియాను చురుకుగా వినియోగిస్తున్నారు?" అని ప్రశ్నించారు. ఈ ప్రశ్నతోనే సాంకేతికతను రాజకీయ ప్రచారానికి వాడుకోవాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కిచెప్పారు. "సోషల్ మీడియానే కదా అని తేలిగ్గా తీసుకోవద్దు. దీనిపై చాలా సీరియస్‌గా ఉండాలి" అని లోకేశ్ నేతలకు స్పష్టం చేశారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు చేరవేయాలని ఆయన సూచించారు. చిన్న స్థాయి నాయకులైన ఏఎంసీ, కార్పొరేషన్ ఛైర్మన్లు కూడా తాము చేస్తున్న పనులను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు వివరిస్తున్నారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీని ఆయన ఉదాహరణగా చూపారు. ప్రధాని మోదీ సైతం తన సందేశాలను సెల్ఫీ వీడియోల ద్వారా ప్రజలకు చేరవేస్తున్నారని లోకేశ్ పేర్కొన్నారు. తాను కూడా సుజ్లాన్ విండ్ ప్రాజెక్టు శంకుస్థాపన, డీఎస్సీపై జరుగుతున్న దుష్ప్రచారం వంటి అంశాలపై సెల్ఫీ వీడియోలు తీసి వాస్తవాలను ప్రజల ముందు ఉంచానని తెలిపారు. విషయం చిన్నదైనా, పెద్దదైనా ప్రజలకు నిజాలు తెలియజేయాల్సిన బాధ్యత నేతలపై ఉందని అన్నారు. ప్రతిపక్షాల తీరుపై లోకేశ్ తీవ్రంగా స్పందించారు. ప్రతిపక్షం పని కేవలం ప్రభుత్వంపై బురదజల్లడమేనని, వారి దుష్ప్రచారాన్ని సోషల్ మీడియా వేదికగా ఎప్పటికప్పుడు మిగతా2లో...



# తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు..



**హైదరాబాద్ సెప్టెంబర్ 08:** తెలుగు రాష్ట్రా ల్లో మంగళవారం తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు, ఉరు ములతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హె చ్చరించింది. తెలంగాణలో అనేక జిల్లాల్లో ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్, ఉత్తర జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకా శం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా, రాయలసీమ ప్రాం తాల్లో మెరుపులు, బలమైన గాలులతో కూడిన వర్షాలు, ఉత్తర కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. మత్స్య కారు లు తీరప్రాంతంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# సామాన్యులకు ఊరట కల్పించేలా చర్యలు

- కిలో ఉల్లిగడ్డలు 32 రూపాయలే...
- వచ్చే వారం నుంచి రైతు బజార్లలో లభ్యం
- ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి



**అమరావతి, సెప్టెంబర్ 08:** ఆంధ్రప్రదేశ్‌లో నిత్యావసరాల ధరల పెరుగుదలతో ఇబ్బంది పడుతున్న సామాన్య ప్రజలకు కూటమి ప్రభుత్వం ఊరట కల్పించే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. వంటింటి భారాన్ని తగ్గించే లక్ష్యంతో, కిలో ఉల్లిపాయలను కేవలం రూ.32కే రాయితీపై అందించనున్నట్లు ప్రకటిం చింది. ఈ మేరకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం సోషల్ మీడియా ద్వారా వివరాలు వెల్లడించారు. వచ్చే వారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 115 రైతు బజార్లు, ప్రత్యేక మొబైల్ కౌంటర్ల ద్వారా ఈ రాయితీ ఉల్లిపాయల మిగతా2లో...

# ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌లకు సస్పెన్షన్

- సెషన్ మొత్తానికి సస్పెన్షన్ వేటు
- ఇద్దరు ఎమ్మెల్సీలపై చర్యలకు తీర్మానం



2లో

# స్పీకర్‌ను పరామర్శించిన సిఎం రేవంత్..



2లో

# శాఖలను సమూలంగా మార్చాలని అధిష్ఠానానికి చెప్పా...

- నాకు మంత్రి పదవి ఇవ్వడం అధిష్ఠానం నిర్ణయం
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడి



2లో

# వైసీపీకి రాజీనామా చేసిన బొత్స మేనల్లుడు



2లో

# రూ.35 వేల కోట్ల ప్రాజెక్టులు ప్రారంభం..

(మొదటి పేజీ తరువాయి)

హయాంలో ఈ ప్రాజెక్టు అలోచనకు రూపకల్పన జరిగినప్పటికీ.. యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో పెద్దగా పురోగతి సాధించలేదని అన్నారు. ఫ్రైట్ కారిడార్ ప్రాజెక్టును 2004లో ప్రతిపాదించారు. కానీ 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చే వరకు దానిపై పెద్దగా ముందడుగు పడలేదు అని చెప్పారు. ఈ ప్రాజెక్టు వల్ల ప్రయోజనం ఏమిటని ప్రశ్నించే వారిపై వ్యంగ్యంగా స్పందిస్తూ.. ఒక నారాజ్ ఫూఫాజీ.. 'ట్రక్ డ్రైవర్లు ఏం చేస్తారు?' అని అడుగుతుంటారు. ఫూఫాజీకి ఇప్పుడు పని దొరికింది అని వ్యాఖ్యానించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా రైల్వే కనెక్టివిటీ లేని ప్రాంతాలకు ఈ ఫ్రైట్ కారిడార్ అనుసంధానాన్ని తీసుకెళ్తోందని మోదీ చెప్పారు. దేశీయ సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడం, ఆత్మనిర్భరతను పెంచడంలో భాగంగానే ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు తెలిపారు. యూపీఏ ప్రభుత్వంపై మరోసారి విమర్శలు గుప్పిస్తూ.. 2014 తర్వాత భారత్ 50 వేల ఆధునిక రైల్వే కోచ్‌లను తయారు చేసింది. గత ప్రభుత్వం పదేళ్లలో కనీసం 50 వేల మరుగుదొడ్లను కూడా నిర్మించలేకపోయింది అని అన్నారు. భారత్ ఇప్పుడు 'చిప్ నుంచి షిప్' వరకు దేశీయ తయారీపై దృష్టి సారిస్తూ కొత్త పారిశ్రామిక యుగంలోకి అడుగుపెడుతోందని చెప్పారు. విడిభాగాల నుంచి తుది ఉత్పత్తుల వరకు దేశంలోనే తయారుచేసే విధంగా తయారీ రంగాన్ని విస్తరిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని విమర్శించే వారిని ఉద్దేశించి మోదీ ఉపయోగిస్తున్న వ్యంగ్య పదజాలంలో 'నారాజ్ ఫూఫాజీ' తాజాగా చేరింది. గత వారం ఢిల్లీలోని శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ శతాబ్ది వేడుకల్లో ఆయన తొలిసారి ఈ పదాన్ని ఉపయోగించారు. యువతను ఆకట్టుకునేలా 'జెన్ జెడ్' పదజాలంతో చేసిన ప్రసంగంలో భాగంగా ఈ వ్యాఖ్య చేశారు. 202627 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో భారత్ సాధించిన అంచనాలకు మించిన 7.8 శాతం జీడీపీ వృద్ధిని ప్రశ్నించిన వారిని ఉద్దేశించి అప్పట్లో మోదీ ఈ పదాన్ని ఉపయోగించారు. ప్రభుత్వ కార్యక్రమాలను వ్యతిరేకించడాన్నే కొందరు 'ఆట'గా మార్చుకున్నారని విమర్శించారు. మోదీ వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే స్పందించారు. ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రధాని ప్రతి ఏడాది కొత్త పదజాలాన్ని తీసుకొస్తున్నారని విమర్శించారు. నారాజ్ ఫూఫా, దిమాగీ నక్సల్, అర్బన్ నక్సల్, ఖాన్ మార్కెట్ గ్యాంగ్, ఆందోళన్‌జీవి, పరజీవి.. పదాలు మారుతూనే ఉంటాయి. కానీ మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు మాత్రం మారవు అని ఖర్గే 'ఎక్స్'లో పేర్కొన్నారు. నకిలీ పీఎంవో అధికారి.. తుపాకీతో 'బాడీగార్డ్' అరెస్ట్ ప్రధాని నరేంద్ర మోదీ కార్యక్రమానికి ఒక రోజు ముందు ముంబైలో నకిలీ పీఎంవో అధికారిగా చెప్పుకున్న ఓ వ్యక్తి, తుపాకీతో ఉన్న అతని బాడీగార్డ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. జియో వరల్డ్ ప్లాజాలో సోమవారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. అయితే దీనికి ప్రధాని మోదీ పర్యటనతో ఎలాంటి సంబంధం లేదని ముంబై పోలీసులు స్పష్టం చేశారు. డ్రోన్ టెక్నాలజీ వ్యాపారం నిర్వహిస్తున్నట్లు చెబుతున్న 28 ఏళ్ల రోహన్ పారేఖ్ జియో వరల్డ్ ప్లాజాలోకి ప్రవేశించాడు. ఆ సమయంలో ప్రధాని కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయి. కొద్దిసేపటి తర్వాత అతని బాడీగార్డ్ దిలీప్ కుండే అక్కడికి వచ్చాడు. మెటల్ డిటెక్టర్‌లో తుపాకీ ఉన్నట్లు గుర్తించడంతో భద్రతా సిబ్బంది అతడిని అడ్డుకున్నారు. దీంతో కుండే ఫోన్ చేయగా పారేఖ్ అక్కడికి తిరిగి వచ్చాడు. ప్రధాన మంత్రి కార్యాలయం (పీఎంవో) జారీ చేసినట్లుగా కనిపిస్తున్న గుర్తింపు కార్డును భద్రతా సిబ్బందికి చూపించాడు. అందులో పారేఖ్‌ను 'గ్రేడ్- సీ అధికారి'గా పేర్కొన్నారు. అయితే కార్డుపై జారీ చేసిన తేదీ ఉన్నప్పటికీ చెల్లుబాటు వ్యవధి లేదు. అలాగే జారీ చేసిన అధికారిగా భావిస్తున్న వ్యక్తి సంతకం ఉన్నా.. ఆయన హోదా పేర్కొనలేదు. దీంతో కార్డు అసలైనదేనా అన్న అనుమానాలు తలెత్తాయి. పారేఖ్, కుండేను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం కుండే వద్ద ఉన్న తుపాకీకి లైసెన్స్ ఉన్నట్లు గుర్తించారు. పారేఖ్‌ను కోర్టులో హాజరుపరచగా.. అతన్ని 11 వరకు పోలీసు కస్టడీకి పంపింది. ఈ కేసుతో సంబంధం ఉన్నట్లు అనుమానిస్తున్న మూడో వ్యక్తి ప్రథమేశ్ బాగుల్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. తన క్లయింట్‌ను ఎవరో మోసం చేసి, తాను పీఎంవో సలహాదారుగా నియమితుడయ్యానని నమ్మించారని పారేఖ్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. పారేఖ్‌కు నియామక పత్రాలుగా కనిపించే కొన్ని పత్రాలు, అధికారికంగా కనిపించే ఈమెయిళ్లు, గుర్తింపు కార్డుకు సంబంధించిన స్క్రీన్‌షాట్ లభించాయని చెప్పారు. అయితే అసలు గుర్తింపు కార్డు మాత్రం ఆయనకు ఇవ్వలేదన్నారు. అంతేకాకుండా బాడీగార్డ్‌ను నియమించుకోవాలని కూడా సూచించినట్లు తెలిపారు. తనతో నిశ్చితార్థం అయిన యువతికి పెర్ఫ్యూమ్ కొనుగోలు చేసేందుకు మాత్రమే పారేఖ్ మాల్‌కు వెళ్లారని, దర్యాప్తు అధికారులను సంప్రదించిన తర్వాత ఆయన పూర్తిగా సహకరించారని న్యాయవాది తెలిపారు. సంబంధిత పత్రాలు, కమ్యూనికేషన్ వివరాలను పారేఖ్ ఇప్పటికే దర్యాప్తు సంస్థలకు అందించారని చెప్పారు. ప్రభుత్వ అధికారిగా తప్పుడు గుర్తింపు పొందడం తదితర నేరాలకు సంబంధించిన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ల కింద బీకేసీ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ముంబై క్రైమ్ బ్రాంచ్ సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించడంతో పాటు పారేఖ్ సమర్పించిన పత్రాలు, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్లను ధ్రువీకరిస్తోంది. పీఎంవోకు సంబంధించినవిగా చూపించిన గుర్తింపు పత్రాలు, ఇతర ఆధారాలు ఎక్కడి నుంచి వచ్చాయన్నదానిపైనా దర్యాప్తు చేస్తున్నారు. పారేఖ్‌కు ఈ పత్రాలు నకిలీవని తెలిసినా వాటిని ఉపయోగించాడా? లేక అతడే మోసానికి గురయ్యాడా? అన్నకోణంలోనూ పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

# ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌లకు సస్పెన్షన్

**హైదరాబాద్, సెప్టెంబర్ 08:** తెలంగాణ రాజకీయాల్లో అసెంబ్లీ ఆవరణలో చోటు చేసుకున్న వివాదం మరో కీలక మలుపు తిరిగింది. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిపై శాసనమండలి సస్పెన్షన్ వేటు వేసింది. ప్రస్తుత వర్షాకాల సమావేశాలు ముగిసే వరకు ఇద్దరినీ మండలి నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. ఇద్దరు ఎమ్మెల్సీలను సస్పెండ్ చేయాలని మంత్రి శ్రీధర్‌బాబు శాసనమండలిలో తీర్మానం ప్రవేశపెట్టారు. ఆ తర్వాత శాసనమండలి ఛైర్మన్ మూజువాణి పద్ధతిలో ఓటింగ్ నిర్వహించారు. తీర్మానానికి ఆమోదం లభించిన తర్వాత తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిని ప్రస్తుత సెషన్ మొత్తానికి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత మండలి సమావేశాన్ని వాయిదా వేశారు. స్పీకర్‌పై ఎమ్మెల్సీలు చేసిన వ్యాఖ్యల వ్యవహారాన్ని శాసనసభ కూడా తీవ్రంగా పరిగణించింది. తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ తీర్మానం చేసింది. తెలంగాణ వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఈ తీర్మానాన్ని శాసనసభలో ప్రవేశపెట్టారు. స్పీకర్ పదవికి గౌరవం తగ్గించేలా వ్యాఖ్యలు చేయడాన్ని శాసనసభ ఖండించింది. సభా మర్యాదలకు విరుద్ధంగా వ్యవహరించడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. మహిళల ఎదుట అనుచితంగా ప్రవర్తించారనే ఆరోపణలను కూడా సభ ఖండించింది.

బీఆర్ఎస్ సభ్యుల ప్రవర్తనకు ఆ పార్టీ అధినేత కేసీఆర్ బాధ్యత వహించాలని, స్పీకర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని తీర్మానంలో పేర్కొన్నారు. అసెంబ్లీ ఆమోదించిన తీర్మానాన్ని శాసనమండలి ఛైర్మన్‌కు పంపించారు. దీనిపై మండలిలో మంత్రి శ్రీధర్‌బాబు మరో తీర్మానం ప్రవేశపెట్టగా.. మూజువాణి ఓటింగ్ అనంతరం ఇద్దరు ఎమ్మెల్సీలపై సస్పెన్షన్ నిర్ణయం వెలువడింది. అసెంబ్లీ ఆవరణలో జరిగిన ఘటనకు సంబంధించి తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మంగళవారం ఉదయం వారిని అదుపులోకి తీసుకుని విచారించిన తర్వాత కోర్టులో హాజరుపరిచారు. అయితే నాంపల్లి కోర్టు పోలీసుల రిమాండ్ అభ్యర్థనను తిరస్కరించింది. వ్యక్తిగత పూచీకత్తుతో విడుదల చేయాలని ఆదేశిస్తూ.. ఒక్కొక్కరు రూ.10 వేల పూచీకత్తుతో పాటు రెండు ష్యూరిటీలు సమర్పించాలని సూచించింది. కోర్టు ఆదేశాల మేరకు ష్యూరిటీలు సమర్పించిన తర్వాత ఇద్దరు ఎమ్మెల్సీలు విడుదలయ్యారు.

కోర్టు నుంచి విడుదలైన తర్వాత ఇద్దరు ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలు శాసనమండలికి హాజరయ్యారు. వారు సభలోకి రావడంపై అధికారపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తాతా మధు, నవీన్ రెడ్డిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. ఈ పరిణామాల మధ్యే సస్పెన్షన్ తీర్మానం మండలి ముందుకు వచ్చింది. తమ పార్టీ ఎమ్మెల్సీలపై సస్పెన్షన్ వేటు వేయడాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకించింది. తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలను నిబంధనలకు విరుద్ధంగా సస్పెండ్ చేశారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు మండలి ఆవరణలో ఆందోళన చేపట్టారు. సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ బైఠాయించారు. ప్రభుత్వం తమ పార్టీ నేతలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు.

# రిపబ్లికన్లకు అగ్నిపరీక్షే !

## అధికార పార్టీకి శాపంగా మారుతున్న ట్రంప్ నిర్ణయాలు

## మధ్యంతరంలో మెజారిటీ అసాధ్యమంటున్న పరిశీలకులు



**వాషింగ్టన్ సెప్టెంబర్ 08:** అమెరికాలో మధ్యంతర ఎన్నికలకు మరో రెండు నెలలు మాత్రమే సమయం ఉండడంతో ప్రచార హోరు ఉధృతమవుతోంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యవహార శైలి, ఆయన అనుసరిస్తున్న విధానాలపై ప్రజలలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్న తరుణంలో రిపబ్లికన్ల విజయావకాశాలు ప్రమాదంలో పడుతున్నాయి. కాంగ్రెస్‌లో ఇప్పటికే స్వల్ప ఆధిక్యతతో నెట్టుకొస్తున్న రిపబ్లికన్లకు ఈ ఎన్నికలు నిజంగా అగ్నిపరీక్షే. మధ్యంతర ఎన్నికలు అంటే దేశాధ్యక్షుడి పనితీరుపై ప్రజలు ఇచ్చే తీర్పు అని నిపుణుల అభిప్రాయం. ఒకవేళ ప్రతినిధులసభలో డెమొక్రాట్లకు మెజారిటీ లభిస్తే ట్రంప్ పాలనపై దర్యాప్తు చేపట్టే అవకాశం ఉంది. ట్రంప్ అవినీతిపై విచారణ జరుపుతామని ఆ పార్టీ నేతలు ఇప్పటికే ప్రకటించారు. డెమొక్రాట్లకు మెజరిటీ వస్తే ట్రంప్ ఒంటెత్తు పోకడలకు బ్రేక్ పడుతుంది. అనేక చట్టాల విషయంలో శ్వేతసౌధం రాజీపడాల్సి వస్తుంది. **అనూహ్య ఫలితం తప్పదా ?** సెనెట్‌పై ఆధిపత్యం కోసం డెమొక్రాట్లు, రిపబ్లికన్ల మధ్య పోటీ తీవ్రంగా ఉంది. ఫలితం అనూహ్యంగా ఉండవచ్చునని చెబుతున్నారు. ఒకవేళ సెనెట్‌లో డెమొక్రాట్లకు మెజారిటీ వస్తే సుప్రీంలో ఖాళీ అయ్యే న్యాయమూర్తుల నియామకంతో పాటు ట్రంప్ నామినీలను చాలా వరకూ అడ్డుకునే అవకాశం ఉంది. రాయిటర్స్/ఇప్సోస్ తాజా సర్వే ప్రకారం ఇరాన్ యుద్ధం, ఆర్థిక వ్యవస్థ పనితీరుపై చాలా మంది తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. దీంతో ట్రంప్ రేటింగ్ అత్యంత కనిష్ట స్థాయికి పడిపోయింది. 2018లో డెమొక్రాట్లు ప్రతినిధులసభలో 40 సీట్లు గెలుచుకున్నారు. అప్పటితో పోలిస్తే ప్రస్తుతం ట్రంప్‌పై వ్యతిరేకత దాదాపు రెట్టింపైంది. రిపబ్లికన్లతో పోలిస్తే డెమొక్రాట్లు ఓటింగ్‌పై బాగా ఆసక్తి కనబరుస్తున్నారు. ఇటీవలి ప్రైమరీ ఎన్నికలలో ఈ విషయం స్పష్టమైంది. రిపబ్లికన్ అభ్యర్థులతో పోలిస్తే డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థులే ఐదు శాతం పాయింట్ల ఆధిక్యతలో ఉన్నారని చెబుతున్నారు. **ఆ నాలుగు రాష్ట్రాలే కీలకం** 1938 నుంచి అమెరికాలో జరిగిన మధ్యంతర ఎన్నికలలో రెండు సందర్భాలలో తప్ప మిగిలిన అన్ని ఎన్నికలలోనూ అధ్యక్షుడి పార్టీ ప్రతినిధులసభలో తన బలాన్ని కోల్పోయింది. ప్రతినిధులసభలో ప్రస్తుతం రిపబ్లికన్లకు 218, డెమొక్రాట్లకు 214 మంది సభ్యులు ఉన్నారు. నవంబర్ 3వ తేదీన ప్రతినిధులసభలోని మొత్తం 435 స్థానాలకు, సెనెట్‌లోని వంద స్థానాలలో సుమారు మూడింట ఒక వంతు సీట్లకు ఎన్నికలు జరుగుతాయి. తీవ్రమైన పోటీ ఉన్న జార్జియా, మైనే, మిచిగాన్, నార్త్ కరోలినాలో డెమొక్రాట్లు మెజారిటీ సెనెట్ స్థానాలను గెలుచుకున్నప్పటికీ 2024 ఎన్నికలలో ట్రంప్‌కు మంచి మెజారిటీ ఇచ్చిన అలాస్కా, లోవా, ఒహియో, టెక్సాస్ రాష్ట్రాలలో వారు కనీసం రెండింటిని గెలుచుకోవాల్సి ఉంటుంది. డెమొక్రాట్లను సోషలిస్టులుగా, కమ్యూనిస్టులుగా రిపబ్లికన్లు చిత్రీకరిస్తున్న విషయం తెలిసిందే.

లోవాలో పెరుగుతున్న ఇంధన ధరలు, ట్రంప్ సుంకాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. అదే సమయంలో విదేశీ గొడ్డు మాంసంపై దిగుమతి పన్నును ఎత్తివేయాలన్న ట్రంప్ నిర్ణయంపై టెక్సాస్‌లోని పశువుల పెంపకందారులు మండిపడుతున్నారు. పొరుగు దేశమైన కెనడాతో జరుగుతున్న వాణిజ్య యుద్ధం మిచిగాన్, మైనే రాష్ట్రాలకు నష్టం కలిగించే అవకాశం ఉంది.

# అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

(మొదటి పేజీ తరువాయి)

తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. వైసీపీ నేతలు, కార్యకర్తలు తమ నాయకుడు 'జగన్ మావిగన్' అంటే గుడ్డిగా సమర్థిస్తున్నారని, కానీ టీడీపీ అలా కాకుండా వాస్తవాలతో ప్రజల్లోకి వెళ్లాలని చెప్పారు. అమరావతిని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని, ఈ విషయాన్ని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

# సామాన్యులకు ఊరట కల్పించేలా చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

విక్రయాలు ప్రారంభమవుతాయని మంత్రి తెలిపారు.

ఉల్లితో పాటు, చౌకధరల దుకాణాల (రేషన్ డిపోలు) ద్వారా రాయితీపై కందిపప్పు, పామాయిల్ కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన పేర్కొన్నారు. బహిరంగ మార్కెట్ ధరలతో పోలిస్తే దాదాపు 30 శాతం తక్కువ ధరకే నాణ్యమైన సరుకులను ప్రజలకు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి సహకారం అందిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గుతుందని భావిస్తున్నారు.

# వైసీపీకి రాజీనామా చేసిన బొత్స మేనల్లుడు

**అమరావతి, సెప్టెంబర్ 08:**

వైసీపీలో కీలక పరిణామం చోటుచేసుకుంది. పార్టీ సీనియర్ నేత, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మేనల్లుడు, విజయనగరం జిల్లా వైసీపీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన తన రాజీనామా లేఖను వైసీపీ అధినేత జగన్‌కు పంపించారు. ఈ పరిణామం ఉత్తరాంధ్ర వైసీపీ శ్రేణులకు పెద్ద ఎదురుదెబ్బగా మారింది. మజ్జి శ్రీనివాసరావు తన రాజీనామా లేఖలో పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు, తాను నిర్వహిస్తున్న విజయనగరం జిల్లా అధ్యక్ష పదవి, భీమిలి నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జ్ బాధ్యతల నుంచి కూడా వైదొలగుతున్నట్లు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆయన విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. బొత్స కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా, జిల్లాలో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా వ్యవహరించే చిన్న శ్రీను అకస్మాత్తుగా ఈ నిర్ణయం తీసుకోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. బొత్స సత్యనారాయణ కుటుంబానికి ఉత్తరాంధ్రలో గట్టి పట్టుంది. అలాంటి కీలక నేత మేనల్లుడే పార్టీని వీడటం వైసీపీకి తీవ్ర నష్టంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. జిల్లాలో కీలకమైన జడ్పీ ఛైర్మన్ పదవిలో ఉంటూ, జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఉన్న నేత రాజీనామా చేయడం వెనుక కారణాలపై పార్టీ వర్గాల్లో భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. అయితే, తన రాజీనామాకు గల కారణాలను చిన్న శ్రీను ఇంకా అధికారికంగా వెల్లడించలేదు. ఆయన భవిష్యత్ కార్యాచరణ ఏమిటనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# స్పీకర్‌ను పరామర్శించిన సిఎం రేవంత్..

**హైదరాబాద్: సెప్టెంబర్ 08:** అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఆయన ఛాంబర్‌లో మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు కలిసి పరామర్శించారు. సోమవారం అసెంబ్లీ ఎదుట జరిగిన పరిణామాల నేపథ్యంలో స్పీకర్‌ను సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కలు కలిశారు. బిఆర్ఎస్ ఎమ్మెల్సీలు స్పీకర్‌ను వ్యక్తిగతంగా దూషించటంతో స్పీకర్ గడ్డం ప్రసాద్ సోమవారం కంట తడి పెట్టుకున్న దృశ్యాలు చూసి ముఖ్యమంత్రి ఆవేదన చెందారు. మంగళవారం అసెంబ్లీకి రాగానే స్పీకర్ ఛాంబర్‌కు వెళ్లిన సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టిలు స్పీకర్‌ను పరామర్శించి, ఓదార్చారు. సోమవారం జరిగిన సంఘటనలపై వారిద్దరూ విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అండగా ఉంటుందని, బాధ్యులపై తప్పకుండా తగిన చర్యలు తీసుకుంటుందని స్పీకర్‌కు వారు హామినిచ్చారు.

# శాఖలను సమూలంగా మార్చాలని అధిష్ఠానానికి చెప్పా...

**హైదరాబాద్, సెప్టెంబర్ 08:** తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో కేబినెట్ విస్తరణ, మంత్రుల శాఖల మార్పుపై ఊహాగానాలు షికారు చేస్తున్న వేళ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. గాంధీ భవన్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం కేబినెట్‌లో ఉన్న మంత్రుల శాఖలన్నింటినీ సమూలంగా పునర్వ్యవస్థీకరించి, కొత్త శాఖలను కేటాయించాలని తాను కాంగ్రెస్ హైకమాండ్‌కు స్పష్టమైన సూచన చేసినట్లు వెల్లడించారు. పీసీసీ అధ్యక్షుడిగా తన పరిధి మేరకు పార్టీ ప్రయోజనాల కోసం ఈ సలహా ఇచ్చానని... దానిపై తుది నిర్ణయం తీసుకోవడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అధిష్ఠానం చేతిలోనే ఉందన్నారు. ఇక తనను మంత్రివర్గంలోకి తీసుకునే అంశంపై స్పందిస్తూ... ఆ విషయాలన్నీ అధిష్ఠానం నిర్ణయానికే వదిలేశానని తెలిపారు. ప్రస్తుతం పార్టీని బలోపేతం చేసే బాధ్యత కలిగిన పీసీసీ అధ్యక్షుడిగా నిరంతరం పనిచేస్తున్నానని పేర్కొన్నారు.

# చంద్రబాబు అపాయింట్‌మెంట్ కోరిన దస్తగిరి

**అమరావతి, సెప్టెంబర్ 08:** మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో అప్రూవర్‌గా మారిన షేక్ దస్తగిరి, ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసేందుకు మంగళవారం అమరావతికి చేరుకున్నాడు. గత ప్రభుత్వంలో తనను వేధించిన అధికారులే ఇప్పటికీ ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఎంకు ఒక వినతిపత్రం సమర్పించేందుకు అమరావతి వచ్చినట్టు వెల్లడించాడు. తన భార్య షేక్ షబానాతో కలిసి వచ్చిన దస్తగిరి, సీఎం అపాయింట్‌మెంట్ కోసం ఎదురుచూస్తున్నట్లు మీడియాకు తెలిపాడు. ఈ సందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ.. మాజీ సీఎం జగన్ పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించాడు. ఇప్పుడు జగన్ కు తాను నైతిక విలువలు చెప్పాల్సి వస్తోందని, జగన్ ఆ స్థాయికి దిగజారారని ఎద్దేవా చేశాడు. రాష్ట్రం గురించి మాట్లాడే ముందు, బాబాయి కూతురికి న్యాయం చేయాలని హితవు పలికాడు. తాను న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా నుంచి వకాల్తా తీసుకున్నట్లు నిరూపిస్తే జైలుకు వెళ్లడానికి సిద్ధమని, ఒకవేళ నిరూపించలేకపోతే జగన్ రాజకీయాల నుంచి తప్పుకుంటారా? అని సవాల్ విసిరాడు. వివేకా హత్య కేసులో జగన్, ఆయన భార్య భారతి విచారణ సంస్థలకు పూర్తిగా సహకరించాలని దస్తగిరి డిమాండ్ చేశాడు. అంతేకాకుండా, వివేకా హత్య కేసు, సంబంధిత మనీలాండరింగ్ వ్యవహారాలపై తన వద్ద ఉన్న కీలక వివరాలను ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేస్తానని దస్తగిరి స్పష్టం చేశాడు. "గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నన్ను చంపేస్తామని బెదిరించిన అధికారులే ఇప్పటికీ నా వెంటపడుతున్నారు. వారి వేధింపులు భరించలేకపోతున్నాం. అందుకే మా గోడును సీఎంతో చెప్పుకోవడానికి వచ్చాం" అని దస్తగిరి ఆవేదన వ్యక్తం చేశాడు. దస్తగిరి భార్య షబానా మాట్లాడుతూ, తాము పులివెందులకు వెళ్లాలంటేనే భయంగా ఉందని కన్నీటిపర్యంతమైంది. తమ కుటుంబం ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, న్యాయం పొందాలనే ఆశతో అమరావతికి వచ్చామని ఆమె తెలిపింది.

భారత్ ప్రతినిధి
తెలుగు దిన పత్రిక
గుంటూరు వార్తలు
బుధవారం, 09 సెప్టెంబర్ 2026



# కలెక్టర్ల సమావేశ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**గుంటూరు, 08 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ఈ నెల 10, 11 తేదీల్లో జరగనున్న జిల్లా కలెక్టర్ ల సమావేశ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ మంగళవారం పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ల సమావేశం వెలగపూడిలో రాష్ట్ర సచివాలయంలో జరగనుంది. అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలలో ఎక్కడా లోపాలు లేకుండా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోటోకాల్ డైరెక్టర్ మోహన్ రావు, గుంటూరు రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె. శ్రీ రమణి, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 'బ్లాస్టింగ్' ఆపేయండి మహాప్రభో









## ప్రాణభయంతో వేములూరిపాడు !
### నివాసాల సమీపంలో పేలుళ్లతో వణుకుతున్న గ్రామం
### ఇళ్లపై పడుతున్న బండరాళ్లు.. బీటలు వారుతున్న గోడలు
### కలెక్టరేట్ అధికారుల నిర్లక్ష్యంపై వైఎస్సార్‌సీపీ తాడికొండ సమన్వయకర్త డైమండ్ బాబు ఆగ్రహం

**గుంటూరు / పీరంగిపురం, 08 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** క్వారీ బ్లాస్టింగ్‌ల మోతతో గుంటూరు జిల్లా ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతకాల్సిన దుస్థితి దాపురించింది. తాడికొండ నియోజకవర్గం, ఫిరంగిపురం మండలం వేములూరిపాడు గ్రామ పరిసరాల్లో నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న క్వారీ మైనింగ్ బ్లాస్టింగ్‌ల వల్ల స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనల నడుమ కాలం వెళ్లదీస్తున్నారు. రాత్రింబవళ్లు తేడా లేకుండా సాగుతున్న భారీ పేలుళ్లతో నివాస ప్రాంతాలు నిత్యం దద్దరిల్లుతున్నాయి. బాధితుల విజ్ఞప్తి మేరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు) మంగళవారం గ్రామంలో స్వయంగా పర్యటించి, బ్లాస్టింగ్‌ల ధాటికి దెబ్బతిన్న ఇళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

**ప్రాణాలు తీస్తున్న రాళ్ల వర్షం.. మహిళల కన్నీటి పర్యంతం**
గ్రామ పర్యటన సందర్భంగా స్థానిక మహిళలు డైమండ్ బాబు ఎదుట తమ గోడును వెళ్లబోసుకుని కన్నీటి పర్యంతమయ్యారు. క్వారీల్లో రక్షణ చర్యలు గాలికొదిలేసి, పరిమితికి మించి రసాయన పేలుళ్లు జరుపుతుండటంతో భారీ బండరాళ్లు ఆకాశంలోకి లేచి ఇళ్లపై పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాళ్ల తాకిడికి పైకప్పు రేకులు ధ్వంసమై ప్రాణాలకే ముప్పు వాటిల్లుతోందని వాపోయారు. గతంలో ఇలాగే రాళ్లు మీదపడి కొందరు ప్రాణాలు కోల్పోయిన విషాదకర సంఘటనలను వారు గుర్తుచేశారు. రెక్కలు ముక్కలు చేసుకుని కట్టుకున్న కొత్త ఇళ్లు సైతం భారీ పేలుళ్ల ప్రకంపనలకు నిలువునా బీటలు వారుతున్నాయని, ఏ క్షణాన ఇళ్లు కూలిపోతాయోనని నిద్రలేనిరాత్రులు గడుపుతున్నామని ఆవేదనవ్యక్తం చేశారు.

**అక్రమమా.. సక్రమమా అనేది పక్కన పెట్టండి**
గ్రామం లో పర్యటించిన అనంతరం డైమండ్ బాబు మీడియాతో మాట్లాడుతూ అధికారుల తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "క్వారీ లీజు అక్రమమా లేక సక్రమమా అనే నిబంధనల వివాదాన్ని ముందు పక్కన పెట్టండి.. అమాయక ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ బ్లాస్టింగ్‌లను తక్షణమే పూర్తిగా నిలిపివేయండి" అని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాల కంటే క్వారీ వ్యాపారుల లాభాలు, ప్రయోజనాలే ప్రభుత్వానికి ముఖ్యమా అని సూటిగా ప్రశ్నించారు. నివాస ప్రాంతాలకు ఇంత సమీపంలో భారీ ఎత్తున విస్ఫోటనాలు జరుపుతుంటే మైనింగ్, రెవెన్యూ యంత్రాంగం ఏం చేస్తోందని నిలదీశారు.

**మైనింగ్ అధికారుల చులకన భావంపై తీవ్ర ఆగ్రహం**
ఈ తీవ్రమైన ప్రజా సమస్యపై జిల్లా కలెక్టరేట్‌కు వెళ్లి బాధ్యతాయుత అధికారితో మాట్లాడితే, ఆయన ఏమాత్రం పట్టించుకోకుండా ఎంతో చులకన భావంతో మాట్లాడటాన్ని డైమండ్ బాబు తీవ్రంగా ఆక్షేపించారు. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యతలో ఉన్న అధికారులే ఇలాంటి నిర్లక్ష్య వైఖరి కనబరిస్తే సామాన్య ప్రజలు తమ బాధలను ఎవరికి చెప్పుకోవాలని మండిపడ్డారు. ఈ వ్యవహారంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తి లేదని, బాధితులకు అండగా చివరివరకు పోరాడుతుందని స్పష్టం చేశారు.

**అల్టిమేటం.. పోరాటానికి సిద్ధం**
ఇకపై నివాసాల సమీపంలో ఎలాంటి బ్లాస్టింగ్ జరిపినా చూస్తూ ఊరుకునేది లేదని ఆయన తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే వేములూరిపాడు గ్రామస్తులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సమస్య శాశ్వత పరిష్కారానికి స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు వెంటనే స్పందించి చర్యలు చేపట్టని పక్షంలో, బాధితులను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ప్రజా పోరాటాలు, ఆందోళనలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు వైఎస్సార్‌సీపీ స్థానిక నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులు బాధ్యతతో మెలగాలి : బోయపాటి శ్రీను









**గుంటూరు, 08 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** సమాజం పట్ల ప్రతి విద్యార్థి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ప్రముఖ సినీ దర్శకుడు, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థి బోయపాటి శ్రీను సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు విజ్ఞత, సంస్కారం, లౌక్యం, బాధ్యతాయుతమైన లక్షణాలను అలవరచుకోవాలని కోరారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తాను ఏఎన్యూ పూర్వ విద్యార్థినని, విశ్వవిద్యాలయం అందించిన సర్టిఫికెట్ తన సినీ జీవితంలో ఎంతో కీలకంగా నిలిచిందని తెలిపారు. ఆ సర్టిఫికెట్ తనను సినీ దర్శకుడిగా ఎదగడానికి దోహదపడిందని గుర్తుచేసు కున్నారు. ప్రతి విద్యార్థి తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తిం పును, నైపుణ్యాన్ని, సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. చదువుతోపాటు వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. సమాజంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ క్రమంగా కనుమరుగవుతుండటం బాధాకరమన్నారు.

**మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి :** నేటి సమాజాన్ని పట్టిపీడిస్తున్న ప్రధాన సమస్యల్లో మాదక ద్రవ్యాల వినియోగం ఒకటని బోయపాటి శ్రీను అన్నారు. విద్యార్థి దశ నుంచే డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. అదే విధంగా మొబైల్ ఫోన్లకు బానిసలుగా మారకుండా వాటిని అవసరమైన మేరకే వినియోగించాలని హితవు పలికారు. రాష్ట్రాన్ని విద్యా, వ్యాపార కేంద్రంగా తీర్చిదిద్దే నాయకులను గుర్తించి ప్రోత్స హించాలని విద్యార్థులకు సూచించారు. రాజధానినిర్మాణంలో ఎన్నో ఆటంకాలు ఎదురైనా రాష్ట్రాన్ని ప్రగతి పథంలోకి తీసు కెళ్లేందుకు కృషి చేస్తున్న నాయకత్వాన్ని గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. తనకు ఏఎన్యూతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ, విశ్వవిద్యాలయం పరిధిలోని నంబూరు, కాజా, పెద్దకాకాని గ్రామాల్లో తాను గతంలో సంచరించిన విషయాలను బోయపాటి శ్రీను గుర్తుచేసుకున్నారు.

**అలరించిన సంగీత విభావరి :** స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. 'పాడుతా తీయగా' ఫైనలిస్ట్ సూర్య కార్తీక్, శ్రీలత బృందం అందించిన సంగీత విభావరి ఆహూతులను అలరించింది. పాటలు, నృత్యాలతో పాటు విశ్వవిద్యాలయ విద్యార్థులు ప్రదర్శించిన వివిధ కళారూపాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. విద్యార్థుల కళా ప్రతిభకు సభికుల నుంచి విశేష స్పందన లభించింది.

# హోటళ్లు రెస్టారెంట్లలో నిబంధనలు పాటించకుంటే ట్రేడ్ లైసెన్స్ రద్దు

### జిఎంసి కమిషనర్ కె. మయూర్ అశోక్




**గుంటూరు, 08 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని హోటళ్లు, రెస్టారెంట్లు ప్రజారోగ్య దృష్ట్యా నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం పరిశుభ్రత, నాణ్యత పాటిస్తూ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించవద్దని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ స్పష్టం చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారులు నగరంలోని పలు ప్రాంతాల్లోని హోటల్స్, రెస్టారెంట్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, గుంటూరు ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని నగరంలోని వ్యాపార సముదాయాలు, ప్రధాన రహదారుల్లోని ఆహార విక్రయ కేంద్రాలు, వంటగదుల పరిశుభ్రతను ప్రజారోగ్య అధికారులు పరిశీలించారన్నారు. ఆహార పదార్థాల తయారీ, నాణ్యత, తాగునీటి సౌకర్యాలు, వ్యర్థాల నిర్వహణ సరిగ్గా లేని కేంద్రాలను గుర్తిస్తే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హోటల్స్ యాజమాన్యాలు నిర్ణీత పరిశుభ్రత, ప్రజారోగ్య నిబంధనలు పాటించాలని, లేకుంటే చట్టప్రకారం చర్యలతోపాటు, ట్రేడ్ లైసెన్స్ లు రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. హోటళ్లలో వాడిన కప్పులు, గ్లాసులు, ప్లేట్లను కేవలం నీళ్లతో కడగడం వల్ల రోగక్రిములు వ్యాపించే ప్రమాదం ఉన్నందున ఎప్పటికప్పుడు మరుగుతున్న నీటిలో స్టెరిలైజేషన్ సెట్ ఉపయోగించి శుభ్రం చేయాలన్నారు. తాగునీటి పాత్రలపై మూతలు లేకపోవడం, పంపులు అమర్చక జగ్గులు ముంచడం వలన నీరు కలుషితమవుతుందని, తప్పనిసరిగా రక్షిత మంచినీటినే వాడాలని, పాత్రలపై మూతలు ఉంచి పంపులు అమర్చాలని ఆదేశించారు. తయారు చేసిన ఆహార పదార్థాలపై ఈగలు, దుమ్ము పడకుండా గ్లాస్ కేసుల్లో ఉంచాలని, స్టోరు గదిలో గోధుమ, మైదా, శనగపిండి, పంచదార వంటి ఆహార పదార్థాలపై మూతలు ఉంచుతూ, బొద్దింకలు, క్రిమి కీటకాలు చేరకుండా అల్మరలకు మెష్ ఏర్పాటు చేయాలన్నారు. అదేవిదంగా హోటల్ ఆవరణలోని గదులకు సున్నం వేయించాలని, పనిచేసే సిబ్బందికి అంటువ్యాధులు లేనట్లు గవర్నమెంట్ సివిల్ అసిస్టెంట్ సర్జన్ వద్ద సర్టిఫికెట్ పొంది ఉండాలని, వారికి శుభ్రమైన డ్రెస్, ఆప్రాన్ అందజేయాలన్నారు. క్యాష్ కౌంటర్ సిబ్బంది హాజరు పట్టికను అందుబాటులో ఉంచాలని, అద్దె ఒప్పంద పత్రాల కాపీని ఇవ్వాలన్నారు. పరిసరాల శుభ్రత, వ్యర్థాల నిర్వహణలో భాగంగా హోటళ్ల నుంచి వచ్చే మసి, చెత్తను రోడ్లపై వేయకుండా డస్ట్ బిన్లలో వేసి సేకరణ వాహనానికే ఇవ్వాలన్నారు. వంటగది, టాయిలెట్ల పరిశుభ్రత కోసం టైల్స్ అమర్చాలని, వంటగది నుంచి వచ్చే ఆయిల్, అన్నం, కూరగాయల వ్యర్థ పదార్థాలు నేరుగా కాలువలోకి పోకుండా మెష్ ఏర్పాటు చేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ప్లాస్టిక్ కవర్లను వాడకూడదని ఆదేశించారు. ప్రజారోగ్య అధికారులు ప్రస్తుతం తనిఖీలు చేసి నోటీసులు అందిస్తున్నారని, నోటీసు అందిన 7 రోజులలోగా పేర్కొన్న లోపాలను సవరించుకొని, నగరపాలక సంస్థకు తెలియజేయాలని, లేనిపక్షంలో చట్టప్రకారం ట్రేడ్ లైసెన్స్ రద్దు చేయడంతోపాటు, అపరాధ రుసుం కూడా విధిస్తామని స్పష్టం చేశారు.

# ఆత్మహత్యల నివారణ వారోత్సవాల్లో పాల్గొన్న డిఎంహెచ్వో




**గుంటూరు, 08 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్:** ఆత్మహత్యల నివారణ వారోత్సవంలో భాగంగా, ఎయిమ్స్ మంగళగిరి, మానసిక వైద్య విభాగం ఆధ్వర్యంలో ఇందిరా నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సి) లో అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆత్మహత్యల నివారణ, ఆత్మహత్యకు సంబంధించిన హెచ్చరిక సంకేతాలు, లక్షణాలు, భారతదేశానికి సంబంధించిన గణాంకాలు, టెలి-మనస్ హెల్ప్ లైన్ నంబర్(14416) నివారించాల్సిన అంశాలు మరియు ఆత్మహత్య ప్రమాదంలో ఉన్న వ్యక్తులకు ఎలా సహాయం మరియు మద్దతు అందించాలనే విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రమాద సంకేతాలను ముందుగానే గుర్తించడం, సకాలంలో జోక్యం చేసుకోవడం మరియు అవసరమైనప్పుడు వృత్తిపరమైన సహాయం పొందడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారిణి డా.కే. విజయలక్ష్మి, సృజన, ఎస్.పి.యం, స్టేట్ ఎన్హెచ్ఎం, డా. రాజీవ్, సిఎఫ్ డబ్ల్యూ, ఎయిమ్స్ మంగళగిరి, డా.సుజాత, సీపీఎం ఓ, డా. శ్రీధర్, పిఓ, ఎన్సిడి, డా. అనూష, డా. సుభాషిణి వైద్యాధి కారులు, వేణు ఎన్హెచ్ఎం కన్సల్టెంట్ పాల్గొన్నారు.

# అమూల్య నర్సింగ్ హోమ్‌పై సీఎంవో చర్యలు




### సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసీల్లో అక్రమాల ఆరోపణలు.. బ్లాక్‌లిస్ట్‌లో ఆసుపత్రి

**నరసరావుపేట, 08 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు ఆధ్వర్యంలో నడుస్తున్న అమూల్య నర్సింగ్ హోమ్‌పై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సీఎంవో కీలక చర్యలు తీసుకున్నట్లు సమాచారం. సీఎం రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్ఎఫ్) ఎల్ఓసీలకు సంబంధించిన వ్యవహారాల్లో అక్రమాలు, తప్పుడు బిల్లులు సమర్పించారనే ఆరోపణలపై నిర్వహించిన విచారణ అనంతరం ఆసుపత్రిని బ్లాక్‌లిస్ట్‌లో చేర్చినట్లు సమాచారం. మెడికల్ హెల్త్ బోర్డు నిర్వహించిన విచారణలో ఆసుపత్రిలో చికిత్స పొందకపోయినా చికిత్స జరిగినట్లు చూపిస్తూ పెద్ద సంఖ్యలో బిల్లులు రూపొందించినట్లు, ఇప్పటికే జరిగిన చికిత్సలకు సంబంధించిన పత్రాలను ఆధారంగా చూపించి బిల్లుల్లో అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించినట్లు తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఆరోగ్య శ్రీ పరిధిలో లేని వైద్యచికిత్సలకు ఆర్థికసహాయం అందించే విధానంలో భాగంగా ఎమ్మెల్యేలు రిక్వెస్ట్ లెటర్లు సమర్పిస్తే, సీఎంవో పరిశీలించి ఎల్ఓసీ మంజూరు చేస్తుంది. అయితే అమూల్య నర్సింగ్ హోమ్‌కు సంబంధించిన ఎల్ఓసీలు, బిల్లుల వ్యవహారంలో అవకతవకలకు సంబంధించిన ఆధారాలు లభించడంతో సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీలతో పాటు సంబంధిత సేవలను నిలిపివేసినట్లు సమాచారం..

## ప్రతి చేనేత కార్మికుడికి పెన్షన్ మంజూరు చేయాలి

### పద్మశాలి సంఘం నేతలు



**విజయనగరం, 08 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్** : విజయనగరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని చేనేత జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ని మర్యాదపూర్వకంగా కలిసి జిల్లాలో చేనేత పెన్షన్లు మంజూరు కొరకే చర్చించడం జరిగింది జిల్లాలో ఉన్నటువంటి ప్రతి చేనేత కార్మికుడికి అర్హుడుగా గుర్తించి పెన్షన్ మంజూరు చేయవలసిందిగా కోరడం జరిగింది. అలాగే వారు కూడా ఏ విధంగా చేనేత కార్మికుని గుర్తిస్తున్నాము వారి యొక్క నియమ నిబంధనలను మాకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పద్మశాలి సాధికార రాష్ట్ర కన్వీనర్ మాడిమి దేవేశ్రీద్ర నాథ్ (బాను) బిజెపి విజయనగరం నియోజకవర్గ నాయకులు యిమశీది సుధీర్, పొన్నగంటి శంకర్రావు, వానపల్లి వీరభద్రరావు, కప్పల రామారావు, చుక్కల పైడితల్లి, ఇమంది వెంకట్రావు, కోసూరు వెంకట్రావు పాల్గొన్నారు.

## పెదకాకాని మండలంలో వివిధ పాఠశాలలను తనిఖీ చేసిన డిఇఓ



**గుంటూరు, 08 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్** : గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ సలీం భాష పెదకాకాని మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నంబూరు, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నంబూరు, మండల ప్రాథమిక పాఠశాల నంబూరు లను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలోని విద్యార్థుల సామర్థ్యాలను, ఎఫ్ ఏ వన్ పరీక్షల లో వచ్చిన మార్కుల తీరును, చూచిరాత పుస్తకాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటుచేశారు. పాఠశాల తెరిచినప్పటి నుండి ఇప్పటివరకు పాఠశాలలు హాజరుకాని విద్యార్థుల వివరాలను తెలియజేయాలన్నారు. పాఠశాలలో డ్రాప్ అవుట్ అయిన పిల్లలు ఎక్కడ ఉన్నారో తెలుసుకోవాలన్నారు. విద్యార్థులకు వారి తరగతులకు తగ్గ సామర్థ్యాలు కలిగి ఉండే విధంగా ఉపాధ్యాయులు బోధన చేయాలన్నారు. తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలు అంటే నమ్మకం ఏర్పడే విధంగా ఉపాధ్యాయులందరు కృషి చేయాలన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్నబడి భోజనం విద్యార్థులందరూ భుజించేవిధంగా తల్లిదండ్రులలో చైతన్యం తీసుకురావాలన్నారు. భోజన నాణ్యత విషయంలో ఎటువంటి రాజీ పడవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## శ్రీ వీరభద్ర స్వామి ఉత్సవాలు విజయవంతం



### విజయవంతం కావడానికి సహకరించిన అదనపు ఎస్పీకి ఘన సత్కారం

**గుంటూరు, 08 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్** : గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం గుంటూరు ఏఆర్ డీఎస్పీ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా అదనపు ఎస్పీ రమణమూర్తిని ఘనంగా సన్మానించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన శ్రీ వీరభద్ర స్వామి వారి 25వ వార్షిక పల్లెర జాతర ఉత్సవాలు విజయవంతంగా ముగియడానికి విశేషంగా సహకరించినందుకు అదనపు ఎస్పీ రమణమూర్తిని ఏఆర్ఆర్ఐ శ్రీ హరి రెడ్డి, కృష్ణయ్యలు నూతన వస్త్రాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి వంశీ స్వామి ఆశీస్సులు అందజేశారు. ఉత్సవాల నిర్వహణలో సహకరించిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు.

# ముగిసిన యూట్యూబర్ నందన విచారణ

### విచారణలో తనకు ఏమీ తెలియదని నందన
### ఈ వ్యవహారం మొత్తం తన భర్త మధుకర్ చూసుకుంటాడని తెలిపిన నందన
### అన్ని ప్రశ్నలకు దాటవేత సమాధానాలు
### నందన భర్త మధుకర్ విచారణకు పిలిచే అవకాశం
### కేసులో అనేక కీలక ప్రశ్నలకు లభించని సమాధానం
### ఈ నెల 16న మరోసారి విచారణకు రావాలని నోటీసులు ఇచ్చిన ఇబ్రహీంపట్నం పోలీసులు
### విచారణ అనంతరం వివరాలు వెల్లడించిన ఇబ్రహీంపట్నం సీఐ సుబ్రహ్మణ్యం





**ఇబ్రహీంపట్నం, 08 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్** : లండన్ ఉద్యోగాలు, వీసా మోసం ఆరోపణల కేసులో ప్రముఖ యూట్యూబర్ (నందూస్ వరల్డ్) రామా నందన పోలీసు విచారణ నేటితో (సెప్టెంబర్ 8,2026) ముగిసింది. నిన్న శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఇమ్మిగ్రేషన్ అధికారులు లుకౌట్ నోటీసు ఆధారంగా ఆమెను అదుపులోకి తీసుకోగా, అనంతరం ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పోలీసులు ఆమెను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. నేడు న్యాయవాదులతో కలిసి ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరైన నందనను పోలీసులు సుదీర్ఘంగా ప్రశ్నించారు. విచారణలోని ముఖ్య అంశాలు:భర్తపై నెట్టేసిన నందన: పోలీసుల విచారణలో ఈ వీసా స్కామ్‌తో తనకు ఎలాంటి సంబంధం లేదని, లండన్ ఉద్యోగాలు, వీసాల వ్యవహారమంతా తన భర్త మధుకరే చూసుకునేవారని నందన తెలిపినట్లు సమాచారం. విచారణలో పోలీసులు అడిగినపలుకీలక ప్రశ్నలకు నందన నేరుగా సమాధానం చెప్పకుండా దాటవేసినట్లు పోలీసులు వెల్లడించారు. మరోసారి విచారణకు నోటీసులు: కేసులో పూర్తి వివరాలు రాబట్టేందుకు నందనకు పోలీసులు 41ఏ నోటీసులు జారీ చేశారు. ఈ నెల సెప్టెంబర్ 16న మరోసారి విచారణకు హాజరుకావాలని ఆదేశించారు. అలాగే ఆమె భర్త మధుకర్‌ను కూడా త్వరలోనే విచారణకు పిలిచే అవకాశం ఉంది. మీడియాకు ముఖం చాటేసి: విచారణ ముగిసిన అనంతరం పోలీస్ స్టేషన్ నుంచి బయటకు వచ్చిన నందన, అక్కడ ఉన్న మీడియా కంటపడకుండా ముఖం దాచుకుంటూ పరుగున కారు ఎక్కి వెళ్లిపోయారు. అసలు కేసు ఏంటి? యూకేలో ఉద్యోగాలు, వీసా ఎక్స్‌టెన్షన్స్, స్పాన్సర్‌షిప్ సర్టిఫికెట్లు (జకీూ) ఇప్పిస్తామంటూ 'డెస్టినీ కన్సల్టెన్సీ' పేరిట దాదాపు 100 మంది బాధితుల నుంచి ఒక్కొక్కరి వద్ద రూ. 15 లక్షల నుండి రూ. 20 లక్షల వరకు వసూలు చేసి మోసం చేశారనేది నందన దంపతులపై ఉన్న ప్రధాన ఆరోపణ. బాధితుడు శివక్రాంతి కుమార్ ఇచ్చిన ఫిర్యాదుతో ఇబ్రహీంపట్నం పోలీసులు ఈ చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే, తాము ఎవరినీ మోసం చేయలేదని, తమపై కావాలనే కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని నందన గతంలో ఒక వీడియో ద్వారా పేర్కొన్నారు.

# నాయకత్వానికి కొత్త దిశ చూపిన టీడీపీ కాన్క్లేవ్

### ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు, 08 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్** : మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో రెండు రోజుల పాటు నిర్వహించిన "టీడీపీ లీడర్‌షిప్ ట్రైనింగ్ కాన్క్లేవ్" నాయకత్వానికి కొత్త దిశ చూపించిందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ లోని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడం, ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగించడం, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరవేయడం వంటి అంశాల్లో ఈ కాన్క్లేవ్ ఎంతో దోహదపడిందన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారానికి చేపడుతున్న చర్యలు, మహిళా సాధికారత, ప్రజా గ్రీవెన్స్ నిర్వహణ, ఇంటింటికి ప్రభుత్వం కార్యక్రమాల అనుభవాలను ఇతర నాయకులతో పంచుకున్నట్లు తెలిపారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేసే నాయకత్వమే తెలుగుదేశం పార్టీ ప్రత్యేకత అని పేర్కొన్నారు. పార్టీ సంస్థాగత బలోపేతం, బూత్ స్థాయి కమిటీల బలోపేతం, యువత మరియు మహిళలను రాజకీయాల్లో మరింత భాగస్వాములను చేయడం, సోషల్ మీడియా వేదికల ద్వారా పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, కూటమి ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించడం వంటి అంశాలపై జరిగిన చర్చలు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయని గళ్ళా మాధవి అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చూపిస్తున్న విజన్, నారా లోకేష్ అందిస్తున్న ఆధునిక నాయకత్వ మార్గదర్శకత్వంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధనలో ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని కాన్క్లేవ్‌లో పిలుపునిచ్చారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలియజేశారు.

# దేశవ్యాప్త వ్యాసరచన పోటీలలో సత్తా చాటిన టార్గెట్ జూబిలేషన్ హై స్కూల్ విద్యార్థులు





**గుంటూరు, 08 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్** : లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ప్రతి సంవత్సరం 'ఇన్సూరెన్స్ వీక్' సెలబ్రేషన్స్‌లో భాగంగా విద్యార్థుల కోసం దేశవ్యాప్తంగా వ్యాసరచన పోటీలను (Essay Writing Competitions) నిర్వహిస్తుంది. ప్రస్తుత 2026 సెప్టెంబర్ లో ఎల్ఐసి తన 70వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న సందర్భంగా వివిధ ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ఈ పోటీలను నిర్వహించారు. గుంటూరు లో ఎల్ఐసి వారు నిర్వహించిన వ్యాసరచన పోటీలలో టార్గెట్ జూబిలేషన్ హై స్కూల్ విద్యార్థులు వి. అక్షయ ప్రథమ బహుమతి, పి. విశాలి ద్వితీయ బహుమతి, పి. యశస్విని మరియు డి. సనా తృతీయ స్థాయిలో విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన విద్యార్థులకు డైరెక్టర్స్ పోనిగేటి రామకృష్ణ రెడ్డి, టి.వి.సుబ్బారావు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ పి. పద్మిని, కె. మంజు ప్రియ, ఏవో లు జయరామ్ రెడ్డి, ఇంచార్జీలు టి. తిరుమల రెడ్డి, వై. గణేష్, కె. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ పై ఎఫ్ఐఆర్.. కాంగ్రెస్ ఆగ్రహం

### బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల దళిత వ్యతిరేక వైఖరికి నిదర్శనం: యన్నం సుధీర్‌బాబు



**విజయవాడ, 08 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్** : ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గేకు జరిగిన అవమానంపై ప్రశ్నించిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని గుంటూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు యన్నం సుధీర్‌బాబు తీవ్రంగా ఖండించారు. ఏపీసీసీ ఆధ్వర్యంలో విజయవాడ ధర్నాచౌక్‌లో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సుధీర్‌బాబు మాట్లాడుతూ కులతత్వ చర్యలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకుండా, వాటిని ప్రశ్నించిన ప్రతిపక్ష నేతపై ఎస్సీ, ఎస్టీ చట్టంలోని నిబంధనల కింద కేసు నమోదు చేయడం దుర్మార్గమన్నారు. ఇది బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల దళిత వ్యతిరేక మనస్తత్వానికి నిదర్శనమని విమర్శించారు. ఇలాంటి కేసులకు కాంగ్రెస్ పార్టీ భయపడబోదని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం క్షేత్రస్థాయిలో పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నాయని, త్వరలోప్రజలే తగినబుద్ధి చెబుతారని అన్నారు. ఈ నిరసనలో గుంటూరు జిల్లా నుంచి కొరివి వినయ్‌కుమార్, గద్దం పాల్, మంగళగిరి సలీం, వెంకటరెడ్డి, దిలీప్, యలమంద, లీగల్‌సెల్ కృష్ణ, వాల్మీకి శ్రీనివాస్, బ్రహ్మం, సుధాకర్ తదితరులతో పాటు గుంటూరు నుంచి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మట్టికి రూపమిచ్చి.. వినాయకుడికి ప్రాణం పోస్తున్న కళాకారులు

### ఏళ్ల తరబడి విగ్రహాల తయారీలో అనుభవం..
### అద్భుతమైన నైపుణ్యంతో ఆకట్టుకుంటున్న గణనాథుడు





**కొత్తవలస, 08 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్** : కొత్తవలస ప్రాంతానికి చెందిన కళాకారుడు గౌరీస్ మరియు సంతోషి ఎన్నో ఏళ్లుగా వినాయక విగ్రహాల తయారీలో తమకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. చిన్ననాటి నుంచే కళలపై ఆసక్తి పెంచుకున్న గౌరీస్ విగ్రహాల తయారీని వృత్తిగా ఎంచుకుని ఎంతో నైపుణ్యంతో గణనాథుడి విగ్రహాలను రూపొందిస్తున్నారు. మట్టి, సహజ పదార్థాలు, రంగులను ఉపయోగిస్తూ వినాయకుడి విగ్రహాలకు అందమైన రూపాన్ని అందించడం ఆయన ప్రత్యేకత. విగ్రహం ఆకృతి, ముఖకవళికలు, కిరీటం, ఆభరణాలు, చేతిలోని ఆయుధాలు తదితర ప్రతి అంశాన్ని ఎంతో శ్రద్ధగా రూపొందిస్తారు. ఈ ఏడాది తయారు చేసిన వినాయక విగ్రహంలో భారీ ఆకారం, ప్రత్యేక అలంకరణ, పర్యావరణహిత పదార్థాలు, విభిన్నమైన రూపకల్పన ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. విగ్రహాన్ని చూసిన భక్తులు కళాకారుడి ప్రతిభను అభినందిస్తున్నారు. "వినాయక విగ్రహాన్ని తయారు చేయడం కేవలం వృత్తి మాత్రమే కాదు. అది భక్తితో కూడిన కళ. భక్తులకు నచ్చేలా, సంప్రదాయానికి అనుగుణంగా విగ్రహాలను రూపొందించడమే మా లక్ష్యం" అని కళాకారుడు తెలిపారు. తన కళ ద్వారా సంస్కృతి, సంప్రదాయాలను ముందుకు తీసుకెళ్తున్న కళాకారుడి వంటి కళాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు.

# సభా హక్కులకు విఘాతం

**వారిపై చర్యలకు మండలికి శాసనసభ సిఫారసు**

**తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించి శాసనమండలికి**

**కేసీఆర్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్**

**ఇలాంటివి మళ్లీ జరగకుండా కఠిన చర్యలు అవసరం**

**దేశానికి తెలిసేలా సభ నిర్ణయం ఉండాలి: దామోదర**

**ఫాంహౌస్ కుట్రలో భాగమే ఆ వ్యాఖ్యలు: భట్టి**

**హైదరాబాద్, సెప్టెంబరు 8:** శాసనసభ స్పీకర్‌ను అవమానించేలా అత్యంత హేయమైన పద్ధతిలో దుర్భాషలాడిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధుసూదన్, నవీన్ రెడ్డిపై సభా హక్కులు, విధానాలు, క్రమశిక్షణకు సంబంధించిన నిబంధనలకు అనుగుణంగా శాసన మండలి చైర్మన్ తదుపరి చర్యలు తీసుకోవాలని కోరుతూ శాసనసభ మంగళవారం తీర్మానం చేసింది. దీనిని సభలో మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రవేశపెట్టగా.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బలపరిచారు. అనంతరం మూజువాణి ఓటు ద్వారా సభ దానిని ఆమోదించింది. తీర్మానాన్ని తాతా మధు, నవీన్ రెడ్డి చర్య సభా హక్కులకు విఘాతం ప్రవేశపెట్టే సందర్భంలో మంత్రి రాజనర్సింహ మాట్లాడుతూ.. ఇలాంటి రోజు వస్తుందని తానెప్పుడూ ఊహించలేదని, ఎమ్మెల్సీలు తమ హోదాను మరిచి దిగజారుడు పదజాలంతో స్పీకర్‌ను, వారి తల్లిని అవమానించేలా మాట్లాడడం అత్యంత హేయమని మండిపడ్డారు. "సభ గౌరవాన్ని అందరూ కాపాడాలి. రాజకీయాల్లో విమర్శలు, అభిప్రాయ భేదాలు ఉంటాయి. కానీ, వ్యక్తిగత దూషణలు హేయం. స్పీకర్ పదవి రాజ్యాంగబద్ధమైన పోస్టు. సభాపతినే అవమానించడం సమంజసం కాదు. స్త్రీని తల్లిగా, బిడ్డగా, శక్తిగా ఆరాధించే, గౌరవించే సంప్రదాయం మనది. అలాంటి సమాజంలో రాజకీయ కక్షలతో ఒక తల్లిని తీసుకుని వచ్చి దూషించడం అత్యంత బాధాకరం. స్పీకర్ చిన్న వయసులోనే తల్లిని కోల్పోయారు. తల్లి లేని లోటుతో ఎదిగి.. ఈ స్థానానికి చేరుకున్నారు" అని వివరించారు. స్వాతంత్ర్యం వచ్చిన 80 సంవత్సరాల తర్వాత కూడా ఆత్మగౌరవానికి విఘాతం కలిగే మాటలు వినాల్సి రావడం దురదృష్టమన్నారు. సంఘటన జరిగి 36 గంటలు గడిచినా పశ్చాత్తాపం వ్యక్తం చేయలేదని తప్పుబట్టారు. స్పీకర్ పదవిని గౌరవించాలని, అది కులానికి, జాతికి, మతానికి సంబంధించినది కాదని తెలిపారు. ప్రజా జీవితంలో ప్రతి ఒక్కరూ జవాబుదారీగా ఉండాలని, అహంకార పూరిత వైఖరి సరికాదని, ఇలాంటి మాటలు పునరావృతం కాకుండా కఠిన వైఖరి అవసరమని స్పష్టం చేశారు. ప్రజా జీవితంలో ఉన్నవాళ్లు సరిగా మాట్లాడకపోతే శాసనసభ ఎటువంటి చర్యలు తీసుకుంటుందనే విషయాలు దేశానికి తెలిసేలా సభ నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.

### ఇది ఫాంహౌజ్ కుట్ర: భట్టి

"ఇటువంటి సంఘటనపై సభలో మాట్లాడే దుస్థితి వస్తుందని ఎప్పుడూ అనుకోలేదు. సభాపతి ప్రసాద్ కుమార్ గురించి ఆ ఎమ్మెల్సీ వ్యక్తపరిచిన విధానం బీఆర్ఎస్ విధానంగానే కనిపిస్తోంది. ఇది వ్యక్తిగతంగా ప్రసాద్‌కు జరిగిన అవమానం కాదు. యావత్తు సభకు జరిగిన అవమానం. వారి దుష్ప్రవర్తనకు వారిపై చర్యలు తీసుకునే అధికారం ఈ సభకు ఉంది" అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సభ లోపల, ఆవరణలో సభ్యుల ప్రవర్తనకు సంబంధించి శిక్ష విధించవచ్చని, వారిని తొలగించవచ్చని, జైలుకు పంపించవచ్చని వివరించారు. "ప్రతిపక్ష పార్టీ నాయకత్వాన్ని చూస్తే బాధ కలుగుతోంది. ఆత్మగౌరవ పోరాటాల నేపథ్యంలో పుట్టిన తెలంగాణలో మళ్లీ ఫ్యూడల్ శక్తుల భావజాలంతోనే ఆ సభ్యుడు అలా మాట్లాడారు. ఫ్యూడల్ వ్యవస్థ నుంచి పుట్టిందే బీఆర్ఎస్. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కావడానికి ఒకరోజు ముందు ఫాంహౌజ్‌లో సమావేశం జరిగింది. స్పీకర్‌పై దాడికి అక్కడే కుట్ర జరిగింది. వీళ్లందరినీ కూర్చోబెట్టుకున్న కుట్రదారు ఉద్బోధించాడు. పాత్రధారులతో చేయించాడు. బీఆర్ఎస్ నాయకత్వ విధానంతోనే ఈ కుట్ర జరిగింది. వాడు.. స్పీకర్ గాడు.. అంటూ మాట్లాడటం ఏం భాష!? ఒక తల్లిని పట్టుకుని అలా మాట్లాడటం చూసి ఈరోజు తెలంగాణ సమాజం తలదించుకుంది" అని వ్యాఖ్యానించారు. . ఫాంహౌజ్ కుట్ర ప్రజాస్వామ్యంపైనే జరిగిందని, పశ్చాత్తాపం ప్రకటిస్తూ తప్పును సరిదిద్దుకునే అవకాశం ఇచ్చినా హరీశ్ రావు మళ్లీ సభాపతిపైకి ఉరికి, ఉరికి వచ్చారని, ఇంత జరిగినా వారిలో ఏమాత్రం పశ్చాత్తాపం కనిపించడం లేదని మండిపడ్డారు. ఇటువంటి విచ్ఛిన్న శక్తులను సభ నుంచే కాదు రాష్ట్రం నుంచే దూరంగా ఉంచాలని పిలుపునిచ్చారు. దొరలు, పెత్తందార్ల మనస్తత్వంతో ఉన్న వారి నుంచి తెలంగాణను కాపాడుకోవాలన్నారు. బీఆర్ఎస్ సభ్యులు వాడిన భాష వెనుక కుట్ర కోణం ఉందని అనుమానిస్తున్నామని ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. సంఘటన జరగడానికి ముందు తాను స్పీకర్ చాంబర్‌లో ఉన్నానని, పోలీసు అధికారులు వచ్చి బీఆర్ఎస్ సభ్యులు నల్ల చొక్కాలు వేసుకుని, వాటిపై ఏవో నినాదాలు రాసుకుని సభ లోపలికి రావడానికి ప్రయత్నిస్తున్నారని స్పీకర్‌కు చెప్పారని తెలిపారు. అప్పుడు రూల్ బుక్ ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పీకర్ ఆదేశాలు ఇచ్చారని, రూల్ బుక్ ప్రకారం వ్యవహరించిన స్పీకర్‌పై అత్యంత దారుణంగా మాట్లాడటం తెలంగాణ సమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందని అన్నారు. ఉద్దేశపూర్వకంగానే స్పీకర్‌ను కించపరిచేలా మాట్లాడారని, కనీసం పశ్చాత్తాపం ప్రకటించలేదని, స్పీకర్ కన్నీళ్లు పెట్టుకుంటే సభకే అవమానమని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల రాజకీయ డ్రామాలు

**రెండు పార్టీలు కుమ్మక్కయ్యాయి**

**ఫామ్ హౌస్లోనే అసెంబ్లీ సమావేశాలు పెట్టాలేమో!**

**అసెంబ్లీ తీరుపై కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపాటు**

**హైదరాబాద్:** ప్రజా సమస్యలపై చర్చించి పరిష్కారాలు చూపాల్సిన శాసనసభను కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు రాజకీయ డ్రామాలకు వేదికగా మార్చారని కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. అసెంబ్లీలో రెండు రోజులపాటు ఒకే అంశంపై చర్చిస్తూ విలువైన సభా సమయాన్ని వృథా చేశారని, ప్రజలు ఎదుర్కొంటున్న ఆసలు సమస్యలను పక్కనపె ట్టడం దుర్మార్గమని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పరస్పరం బజారు భాషలో విమర్శించుకోవడం, స్పీకర్ను అడ సభ్య పదజాలంతో దూషించడం ప్రజాస్వామ్యవాదులు జీర్ణించుకోలేరని అన్నారు. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు, విద్యార్థుల సర్టిఫికెట్ల సమస్య, సాగునీటి కొరత, నిరుద్యోగం, పరిశ్రమలు, ఐటీ సంస్థల పరిస్థితి, ఉద్యోగులు-ఉపాధ్యాయులు-పెన్షనర్లకు రావాల్సిన డీఏలు, రి టైర్మెంట్ బెనిఫిట్లు, పెండింగ్ బిల్లులు వంటి అనేక సమస్యలు చర్చించాల్సిన అవసరం ఉందని బండి సంజయ్ పేర్కొన్నారు. మంగళవారం కేంద్రమంత్రి బండి సంజయ్ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై చర్చించకుండా 'డైవర్షన్ డ్రామాలు చేయడం మానుకోవాలని కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలకు సూచించారు. రెండు పార్టీలు కుమ్మ క్కై ప్రజలను పక్కదారి పట్టిస్తున్నాయని ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే వారిని పోలీసులు అడ్డుకోవడం సరికాదని అన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ కోసం నిరసన తెలిపిన బీజేపీ కార్యకర్తలపై పోలీసులు రక్తం కారేలా దాడి చేశారని ఆరోపించారు. అదే సమయంలో విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై బీఆర్ఎస్ నాయకులు దాడి చేయడం, అసభ్య పదజాలంతో దూషించడం కూడా తప్పేనని స్పష్టం చేశారు. తాతా మధుతోపాటు పోలీసులపై చేయి చేసుకున్న బీఆర్ఎస్ నేతలను వెంటనే ఆరెస్టు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సబికా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి వంటి సీనియర్ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు హేయమని, వారిపై అనుచితంగా ప్రవర్తించిన పోలీసులపైనా చర్యలు తీసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ఉండే అర్హతను ఎప్పుడో కోల్పోయిందని, అసెంబ్లీకి హాజరు కాని కేసీఆర్ కు ప్రధాన ప్రతిపక్ష నేత హోదా ఎందుకని ప్రశ్నించారు. అవసరమైతే ఎర్రవల్లి ఫాంహౌస్లోనే అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి కేసీఆర్ను సభకు రప్పించాలని ఎద్దేవా చేశారు. 29 "నైనా రాజకీయ నాటకాలు కట్టిపెట్టి ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని డిమాండ్ చేశారు.

# బీఆర్ఎస్ అధినేత హత్యకు కుట్ర..

**కేసీఆర్‌కు రక్షణ కల్పించాలి**

**బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైనే..**

**కేటీఆర్ సంచలన ఆరోపణలు**

**కేసీఆర్‌కు భద్రతపై పోలీసులపై నమ్మకం లేదు**

**మన నాయకుడు కేసీఆర్ ను మనమే కాపాడుకోవాలి**

**కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు వెళ్తుండగా కేటీఆర్ అరెస్ట్**

**హరీశ్‌రావుతో పాటు బీఆర్ఎస్ నేతల అరెస్టులు**

**బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ వద్ద రణరంగం..**

**రాళ్లు, కుర్చీలతో బీఆర్ఎస్, కాంగ్రెస్ దాడులు**



**హైదరాబాద్,సెప్టెంబర్8 :** బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వద్ద చోటుచేసుకున్న పరిణామాలు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. కాంగ్రెస్ నేతలు డప్పులతో ఎర్రవల్లి ఫాంహౌజ్ ముట్టడించడానికి ప్రయత్నించిన సందర్భంగా.. కేసీఆర్‌ను పరామర్శించేందుకు, ఆయనకు రక్షణగా ఎర్రవల్లికి బయలుదేరిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు సహా పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు.. హకీంపేట వద్ద అడ్డుకుని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ సంచలన ఆరోపణలకు తెరతీశారు. కాంగ్రెస్ శ్రేణులు కేసీఆర్‌పై కుట్రపూరితంగా హత్యాయత్నానికి పాల్పడ్డాయని ఆరోపించారు. ఫామ్‌హౌస్‌కు వెళ్తున్న సమయంలో పోలీసులు కేటీఆర్‌ను అదుపులోకి తీసుకుని బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్కడ మీడియాతో మాట్లాడిన కేటీఆర్.. ఎర్రవల్లి ఫామ్‌హౌస్ ముట్టడి పేరుతో కాంగ్రెస్ శ్రేణులు అరాచకానికి పాల్పడ్డాయని ఆరోపించారు. కేసీఆర్ ఫాంహౌజ్ వరకు కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు ఎలా అనుమతించారని కేటీఆర్ ప్రశ్నించారు. అదే సమయంలో తమ సొంత నాయకుడి నివాసానికి వెళ్తున్న బీఆర్ఎస్ నేతలను ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. దీనిపై డీజీపీ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌కు రక్షణ కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని అన్నారు. పోలీసులు కాంగ్రెస్ శ్రేణులను పట్టించుకోకుండా బీఆర్ఎస్ నాయకులను మాత్రమే లక్ష్యంగా చేసుకుంటున్నారని కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. కేసీఆర్ నివాసం వైపు కాంగ్రెస్ నేతలు వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద వందలాది మంది పోలీసులను మోహరించామని అధికారులు చెప్పినప్పటికీ.. తమ నాయకుడి భద్రత విషయంలో పోలీసులపై నమ్మకం లేదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. తమ నాయకుడిని తామే కాపాడుకోవాలి అంటూ బీఆర్ఎస్ నేతలు ముందుకు సాగారు. అసెంబ్లీ నుంచి కేటీఆర్, హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎర్రవల్లి బయలుదేరారు. తొలుత బొల్లారం వద్ద వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఆ తర్వాత హకీంపేట వద్ద కేటీఆర్, హరీశ్‌రావులను నిలిపివేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. కేసీఆర్ ఇంటి వైపు వెళ్లేందుకు కాంగ్రెస్ శ్రేణులకు అనుమతి ఇచ్చారా అని కేటీఆర్ పోలీసులను ప్రశ్నించారు. కేసీఆర్ నివాసం వైపు ఎవరూ వెళ్లకుండా చర్యలు తీసుకున్నామని పోలీసులు వివరించారు. అయినప్పటికీ బీఆర్ఎస్ నేతలు వెనక్కి తగ్గలేదు. కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు పలువురు ఎమ్మెల్యేలు బొల్లారం చౌరస్తా నుంచి ఎర్రవల్లి వైపు పాదయాత్రగా బయలుదేరారు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని జవహర్‌నగర్, బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్లకు తరలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రతిపక్షాలపై దృష్టి పెట్టిందని కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు డైవర్షన్ రాజకీయాలకు తెరలేపిందని ఆరోపించారు. ప్రజా సమస్యలపై రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని.. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వం తన విధానాలను మార్చుకునే వరకు, ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అసెంబ్లీ సమావేశాల తీరుపైనా కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. కేసీఆర్, బీఆర్ఎస్ నేతలను విమర్శించడానికే సభను ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. ఒక రోజు రాజకీయ విమర్శలకు కేటాయించి, మిగిలిన సమయాన్ని ప్రజా సమస్యలపై చర్చించేందుకు వినియోగించాలని సూచించారు. దళితులపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే దళిత, గిరిజన డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ సవాల్ విసిరారు. దళితబంధు పథకం కింద ఒక్కో కుటుంబానికి రూ.12 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి.. ఇప్పటివరకు నిధులు ఇవ్వలేదని విమర్శించారు. కేటీఆర్, హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ నేతల అరెస్ట్‌తో మేడ్చల్ పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీగా బలగాలను మోహరించారు. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్?రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్? చేస్తున్నారని మాజీమంత్రి హరీశ్?రావు విమర్శించారు. సభలో సమస్యలు చర్చించకుండా రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. సబితా ఇంద్రారెడ్డి గొంతు పిసికితే రేవంత్ రెడ్డికి కనపడలేదని, మహిళ ఎమ్మెల్యేలు ఫిర్యాదు ఇస్తే ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని ఆరోపించారు. రాష్ట్రంలో మహిళలు ఏమనుకుంటారోనన్న జ్ఞానం లేదా అని నిలదీశారు. రేవంత్ రెడ్డి కలియుగ దుశ్శాసనుడు అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. కౌరవులకు పట్టిన గతి కాంగ్రెస్?కు పడుతుందని హరీశ్? వ్యాఖ్యానించారు. బీజేపీ సభ్యులు ప్లకార్డులతో అసెంబ్లీలోకి వెళ్లారన్న హరీశ్?, దీన్నిబట్టే బడే భాయ్ చోటే భాయ్ బంధం అర్థం అవుతోందన్నారు. సీఎం చేతకాని తనం వల్ల క్రాప్? హాలిడే ఇచ్చే పరిస్థితి నెలకొందని ఆరోపించారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా ప్రజాక్షేత్రంలో ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగడతామని స్పష్టంచేశారు. ఎవరిది అసభ్యకర భాష, ఎవరిది వికృత భాష అని ప్రజలు గమనిస్తున్నారు. కేసీఆర్ ఇంటి మీద ముఖ్యమంత్రి దాడికి ఉసిగొల్పారు. దీనిపై కేంద్రం జోక్యం చేసుకోవాలి. రేవంత్ రెడ్డి ఎప్పుడూ కేసీఆర్ చావును కోరుకుంటారు. ఎమ్మెల్యేల చేత కేసీఆర్ చావాలని మాట్లాడిస్తున్నారు. రేవంత్ రెడ్డి అండతోనే ఎమ్మెల్యే శంకర్ కేసీఆర్?పై మాట్లాడారు. శంకర్?పై కేసుపెట్టాలి, సభ్యత్వం రద్దు చేయాలని అన్నారు.

కాగా బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ వద్ద బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కేటీఆర్ సహా పలువురు నేతలను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లకు తరలించిన నేపథ్యంలో బీఆర్ఎస్ కార్యకర్తలు అక్కడికి భారీగా చేరుకున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ శ్రేణులు కూడా రావడంతో ఇరు వర్గాల మధ్య నినాదాలు, వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. ఇరువర్గాలు రాళ్లు, కుర్చీలు విసురుకోవడంతో ఆ ప్రాంతం అంతా రణరంగంగా మారిపోయింది. పరిస్థితి అదుపు తప్పడంతో కొందరు కార్యకర్తలు కుర్చీలు, రాళ్లు విసురుకున్నట్లు తెలుస్తోంది. దీంతో పోలీస్ స్టేషన్ పరిసరాల్లో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తమ పార్టీ నేతలను అక్రమంగా అరెస్ట్ చేశారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించారు. అరెస్ట్ చేసిన నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తల ఆందోళన కొనసాగుతున్న సమయంలో కాంగ్రెస్ శ్రేణులు కూడా అక్కడికి చేరుకోవడంతో ఇరు వర్గాల మధ్య ఉద్రిక్తత పెరిగింది. ఒకరిపై ఒకరు నినాదాలు చేసుకుంటూ కార్యకర్తలు ముందుకు రావడంతో పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో తోపులాట చోటుచేసుకోగా, పరిస్థితి మరింత తీవ్రరూపం దాల్చినట్లు సమాచారం. రాళ్లు, కుర్చీలతో పరస్పరం దాడులు జరిగినట్లు ప్రత్యక్షంగా ఉన్నవారు చెబుతున్నారు. ఈ ఘటనలో పలువురికి గాయాలైనట్లు తెలుస్తోంది. ఘర్షణలో కాంగ్రెస్‌కు చెందిన పలువురు కార్యకర్తలు గాయపడినట్లు సమాచారం. ఓ మహిళా కార్యకర్త చేతికి తీవ్ర గాయమైందని.. చేయి విరిగినట్లు సమాచారం. అయితే గాయాలపై పూర్తి వివరాలు, ఘటనకు సంబంధించిన కారణాలపై అధికారికంగా పూర్తి సమాచారం వెలువడాల్సి ఉంది. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు పోలీసులు అదనపు బలగాలను రంగంలోకి దించారు. అతి కష్టం మీద ఇరు వర్గాలను అక్కడి నుంచి చెదరగొట్టారు. ఈ ఘటనల నేపథ్యంలో బోయిన్‌పల్లి, జవహర్‌నగర్ సహా బీఆర్ఎస్ నేతలను తరలించిన పోలీస్ స్టేషన్ల పరిసరాల్లో పోలీసులు అప్రమత్తంగా ఉన్నారు. తమ పార్టీ నేతలను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా తప్పుపట్టింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. పోలీస్ స్టేషన్‌లో ఉన్న తమ నేతలకు కూడా రక్షణ లేకుండా పోయిందని బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌లకు సస్పెన్షన్ వేటు

**సెషన్ మొత్తానికి సస్పెన్షన్**

**ఇద్దరు ఎమ్మెల్సీలపై చర్యలకు తీర్మానం**





**హైదరాబాద్,సెప్టెంబర్8 :** తెలంగాణ రాజకీయాల్లో అసెంబ్లీ ఆవరణలో చోటుచేసుకున్న వివాదం మరో కీలక మలుపు తిరిగింది. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిపై శాసనమండలి సస్పెన్షన్ వేటు వేసింది. ప్రస్తుత వర్షాకాల సమావేశాలు ముగిసే వరకు ఇద్దరినీ మండలి నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. ఇద్దరు ఎమ్మెల్సీలను సస్పెండ్ చేయాలని మంత్రి శ్రీధర్‌బాబు శాసనమండలిలో తీర్మానం ప్రవేశపెట్టారు. ఆ తర్వాత శాసనమండలి చైర్మన్ మూజువాణి పద్ధతిలో ఓటింగ్ నిర్వహించారు. తీర్మానానికి ఆమోదం లభించిన తర్వాత తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిని ప్రస్తుత సెషన్ మొత్తానికి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత మండలి సమావేశాన్ని వాయిదా వేశారు. స్పీకర్‌పై ఎమ్మెల్సీలు చేసిన వ్యాఖ్యల వ్యవహారాన్ని శాసనసభ కూడా తీవ్రంగా పరిగణించింది. తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ తీర్మానం చేసింది. తెలంగాణ వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఈ తీర్మానాన్ని శాసనసభలో ప్రవేశపెట్టారు. స్పీకర్ పదవికి గౌరవం తగ్గించేలా వ్యాఖ్యలు చేయడాన్ని శాసనసభ ఖండించింది. సభా మర్యాదలకు విరుద్ధంగా వ్యవహరించడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. మహిళల ఎదుట అనుచితంగా ప్రవర్తించారనే ఆరోపణలను కూడా సభ ఖండించింది. బీఆర్ఎస్ సభ్యుల ప్రవర్తనకు ఆ పార్టీ అధినేత కేసీఆర్ బాధ్యత వహించాలని, స్పీకర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని తీర్మానంలో పేర్కొన్నారు. అసెంబ్లీ ఆమోదించిన తీర్మానాన్ని శాసనమండలి చైర్మన్‌కు పంపించారు. దీనిపై మండలిలో మంత్రి శ్రీధర్‌బాబు మరో తీర్మానం ప్రవేశపెట్టగా.. మూజువాణి ఓటింగ్ అనంతరం ఇద్దరు ఎమ్మెల్సీలపై సస్పెన్షన్ నిర్ణయం వెలువడింది. అసెంబ్లీ ఆవరణలో జరిగిన ఘటనకు సంబంధించి తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం ఉదయం వారిని అదుపులోకి తీసుకుని విచారించిన తర్వాత కోర్టులో హాజరుపరిచారు. అయితే నాంపల్లి కోర్టు పోలీసుల రిమాండ్ అభ్యర్థనను తిరస్కరించింది. వ్యక్తిగత పూచీకత్తుతో విడుదల చేయాలని ఆదేశిస్తూ.. ఒక్కొక్కరు రూ.10 వేల పూచీకత్తుతో పాటు రెండు ష్యూరిటీలు సమర్పించాలని సూచించింది. కోర్టు ఆదేశాల మేరకు ష్యూరిటీలు సమర్పించిన తర్వాత ఇద్దరు ఎమ్మెల్సీలు విడుదలయ్యారు. కోర్టు నుంచి విడుదలైన తర్వాత ఇద్దరు ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలు శాసనమండలికి హాజరయ్యారు. వారు సభలోకి రావడంపై అధికారపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తాతా మధు, నవీన్ రెడ్డిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. ఈ పరిణామాల మధ్యే సస్పెన్షన్ తీర్మానం మండలి ముందుకు వచ్చింది. తమ పార్టీ ఎమ్మెల్సీలపై సస్పెన్షన్ వేటు వేయడాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకించింది. తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలను నిబంధనలకు విరుద్ధంగా సస్పెండ్ చేశారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు మండలి ఆవరణలో ఆందోళన చేపట్టారు. సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ బైఠాయించారు. ప్రభుత్వం తమ పార్టీ నేతలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు.

# యువత సత్యం వైపే నిలుస్తుంది

అది ముమ్మాటికీ ఝూట్ గూంజ్

తప్పుదోవ పట్టించేవారు ప్రతి మలుపులో ఉంటారు

రాహుల్ ఛాత్రోంకీ గూంజ్పై మోడీ విసుర్లు

2047నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్

యువత ఏఐ నైపుణ్యాలు నేర్చుకోవాలి

నారాజ్ పుఫాలను పట్టించుకోవద్దు: ప్రధాని మోడీ

డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్పై ప్రశంసలు

యూపీఏ పాలనలో మందగొడిగా పనులు

వడోదరలో రూ.35 వేల కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం




**వడోదర:** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేపట్టిన ఛాత్రోంకీ గూంజ్ కార్యక్రమంపై ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం విమర్శలు గుప్పించారు. యువత సత్యం వైపే నిలుస్తుందని, అది ముమ్మాటికీ ఝూట్ గూంజ్ అని ఆయన అభివర్ణించారు. ఛత్రోంకీ గూంజ్ ద్వారా యు-వతను తప్పుదోవ పట్టించే వారు అడుగగడుగునా కనిపిస్తారు.. కానీ నేటి యువత మాత్రం సత్యం వైపే నిలబడుతుంది అని అన్నారు. మంగళ వారం గుజరాత్లోని వడోదరలో నిర్వహించిన నమో ఫర్ విరసెత్ భారత్ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ కీలక ప్రసంగం చేశారు. రూ.35,000 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించి, పలు పనులకు శంకుస్థాపన చేశారు. అంతకు ముందు వడోదర-ముంబై ఎక్స్ప్రెస్వేలో కీలకమైన సుమ న సుమారు 150 కిలోమీటర్ల మార్గాన్ని ప్రారంభించా రు. దీంతో వడోదర నుంచి భరూచ్, అంక్లేశ్వర్ మీదుగా సూర త్-సవసారీ వరకు ఉన్న రెండు ప్రధాన సెక్షన్లు ఈ ప్రారంభం తో అందుబాటులోకి వచ్చాయి. అనంతరం సభలో యువత ను ఉద్దేశించి మోడీ ప్రసంగించారు. దేశాన్ని 2047 నాటికి అబి వృద్ధి చెందిన దేశంగా మార్చే లక్ష్యంతో మౌలిక సదుపాయాల అభివృద్ధి, యువత నైపుణ్యాలు, ఆధునిక సాంకేతికతను ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. ఏఐ కేవలం ఐటీ రంగానికే పరిమితం కాదని, వ్యవసాయం, ఆరోగ్యం, తయారీ, రోబో టిక్స్ తదితర రంగాల్లోనూ భారీ అవకాశాలను సృష్టించ గలదని పేర్కొన్నారు. గత యూపీఏ పాలనపై విమర్శలు గుప్పించిన మోడీ... యూపీఏ హయాంలో కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల ఫైళ్లు వివిధ ప్రభుత్వ విభాగాల మధ్య తిరుగుతూ ఆలస్యం అయ్యేవని పేర్కొన్నారు. ప్రస్తుతం స్తుతం దేశంలో నిర్ణయాలు వేగంగా తీసుకుంటూ ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం సాదిస్తున్న అభివృ ద్ధిని ప్రశ్నిస్తున్న వారిపై ప్రధాని మోడీ మరోసారి విరుచు కుపడ్డారు. నారాజ్ పూ-పాసు ఏ మాత్రం పట్టించుకోవద్దు అని ప్రతిపక్షపార్టీ నేతలను విమర్శించారు.

## 379 కి.మీ పొడవైన ఎక్సప్రెస్వే

వడోదర-ముంబై ఎక్స్ప్రెస్వేలో 150కి, మీ కీలక మార్గం ప్రారంభించిన ప్రధాని మోదీగుజరాత్లో పర్యటిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నడోదర-ముంబై ఎక్సప్రెస్వేలో కీలకమైన సుమారు 150 కిలోమీటర్ల మార్గాన్ని మంగళ వారం ప్రారంభించారు. దీంతో వడోదర నుంచి భరూచ్, అం క్లేశ్వర్ మీదుగా సూరత్-నవ్సారీ వరకు రెండు ప్రధాన సెక్షన్లు అందుబాటులోకి వచ్చాయి. వడోదర-ముంబై ఎక్స్ ప్రెస్వే మొత్తం సుమారు 379 కిలోమీటర్ల పొడవు కలిగి ఉంది. తాజా గా ప్రారంభించిన మార్గాలతో వడోదర నుంచినవసారీ వరకు హైస్పీడ్ రహదారి కనెక్టివిటీ మరింత మెరుగుపడనుంది. ఈ ఎక్స్ప్రెస్వే పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే గుజరాత్, మహారాష్ట్ర మధ్య రోడ్డు ప్రయాణం వేగవంతం కానుంది. పారిశ్రామిక ప్రాంతాలు, వాణిజ్యకేంద్రాలు పోర్టుల మధ్య సరుకు రవాణా మరింత సులభమయ్యే అవకాశం ఉంది. వడోదర-ముంబై ఎక్స్ప్రెస్వేతో పాటు వెస్టన్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడం గుజరాత్లో పారి శ్రామిక, వాణిజ్య రవాణాకు మరింత ఊతమివ్వనుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది.

## నవ్సారిలో బీజేపీ ఆఫీస్ ప్రారంభం

దక్షిణ గుజరాత్లోని నవ్సారి పట్టణంలో బీజేపీ కొత్తగా నిర్మించిన నమో కమలం కార్యాలయాన్ని మంగళ వారం ప్రధాని నరేంద్ర మోడీ ప్రార్ధ ప్రారంభించారు. అనంతరం బీజేపీ కార్యకర్తలు, సాధారణ పౌరులను ఉద్దేశించి మోడీ ప్రసంగించారు. నవ్సరిలోని పార్టీ కార్యకర్తలు చాలా సంవత్సరాలుగా ప్రజల నుంచి అధిక మద్దతు పొందినప్పటికీ అభివృద్ధి కోసం పని చేస్తూనే ఉన్నారని పేర్కొన్నారు. దేశంలోనే అత్యధిక మెజారిటీతో బీజేపీ నేత, ప్రస్తుత కేంద్ర మంత్రి సీఆర్, పాటిల్ను ఎన్నుకోవడం ద్వారా నవ్సారి 2019లో జాతీయ రికార్డు సృష్టించిందని ప్రధాని మోడీ గుర్తుచేశారు.

# ప్రధాని పర్యటనలో తుపాకీ కలకలం

పీఎంఓ ఉద్యోగినంటూ నకిలీ కార్డుతో బుకాయింపు

తుపాకీతో ఉన్న బాడీగార్డ్ కూడా అదుపులో..

ఇద్దరినీ అరెస్ట్ చేసిన బాంద్రా-కుర్లా పోలీసులు

భద్రతా తనిఖీల్లో బయటపడ్డ బండారం

భద్రతా వైఫల్యంపై విచారణ చేపట్టిన ముంబై క్రైం బ్రాంచ్

అసలు ఉద్దేశంపై ఆరా తీస్తున్న భద్రతా అధికారులు



**ముంబై :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముంబై పర్యటనకు ముందు బాంద్రా-కుర్లా కాంప్లెక్స్ ( లో భద్రతా కలకలం చోటుచేసుకుంది. ప్రధాని మోదీ పాల్గొననున్న కార్యక్రమం జరిగే ప్రాంతంలో ఇద్దరు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఒకరు తాను ప్రధానమంత్రి కార్యాలయం అధికారినని చెప్పుకున్నట్లు సమాచారం. అతని వద్ద నకిలీ గుర్తింపు కార్డు, తుపాకీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అధికారిక వివరాల ప్రకారం, ముంబైలోని నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్ ప్రాంగణంలో ఈ ఇద్దరిని గుర్తించారు. నకిలీ గుర్తింపు కార్డుతో ఉన్న వ్యక్తిని 24 ఏళ్ల రోహన్ పరేఖ్గా గుర్తించారు. అతనితో పాటు ఉన్న అంగరక్షకుడి వద్ద తుపాకీ ఉన్నట్లు పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. భద్రతా సిబ్బంది తనిఖీల్లో గుర్తింపు కార్డు అనుమానాస్పదంగా కనిపించడంతో పరిశీలించగా అది నకిలీదని తేలింది. నకిలీ గుర్తింపు కార్డును ఎలా సంపాదించాడు? తాను అధికారినని ఎందుకు చెప్పుకున్నాడు? తుపాకీతో ఉన్న బాడీగార్డుతో కలిసి ప్రధాని కార్యక్రమం జరిగే ప్రదేశంలోకి ఎందుకు రావడానికి ప్రయత్నించారు? అనే అంశాలపై ముంబై క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తు చేస్తోంది. అయి-తే, ప్రస్తుతానికి ప్రధాని మోదీని లక్ష్యంగా చేసుకునే ఉద్దేశంతో వారు అక్కడికి వచ్చినట్లు ఎలాంటి అధికారిక సమాచారం వెలువడలేదు. ఇదిలా ఉండగా, ప్రధాని మోదీ సెప్టెంబర్ 8న సాయంత్రం 5:45 గంటల సమయంలో ముంబైలో గ్లోబల్ ఫిన్టెక్ ఫెస్ట్ 2026ను ప్రారంభించనున్నారు. సెప్టెంబర్ 8 నుంచి 11 వరకు జరిగే ఈ ఏడో ఎడిషన్లో ఫైనాన్స్ భవిష్యత్తు, ఏజెంటిక్ , టోకెనైజేషన్, క్వాంటమ్ టెక్నాలజీ, డిజిటల్ చెల్లింపులు, ఆర్థిక సమ్మిళితంపై చర్చలు జరగనున్నాయి. అంతకుముందు ప్రధాని గుజరాత్లోని వడోదరలో రూ.35,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, జాతికి అంకిత కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఇందులో రూ.20,700 కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన వెస్టన్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్లోని 326 రూట్ కిలోమీటర్ల మూడు కీలక విభాగాలు ఉన్నాయి.ప్రధాని ముంబై పర్యటనకు ముందు నకిలీ గుర్తింపు కార్డు, తుపాకీతో ఇద్దరు వ్యక్తులు పట్టుబడటం భద్రతా వ్యవస్థను అప్రమత్తం చేసింది. ఈ ఘటన వెనుక అసలు ఉద్దేశం ఏంటన్నది క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తులో తేలాల్సి ఉంది.

## రీల్స్కు బానిసైన మహిళ..

### ఇంటర్నెట్ లేక, వీడియోలు రాక ఆత్మహత్య



**కోర్బా(ఛత్తీస్గఢ్) :** ఫోన్లో నిరంతరం రీల్స్ చూడటానికి అలవాటుపడిన ఓ 52 ఏళ్ల మహిళ.. ఇంటర్నెట్ సరిగ్గా రావడం లేదనే కారణంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన ఛత్తీస్గఢ్లో మంగళవారం వెలుగులోకి వచ్చింది. కోర్బా జిల్లా, కేరాకచ్చర్ గ్రామానికి చెందిన మంగ్లో బాయ్ సారథి రీల్స్ చూడటానికి తీవ్రంగా బానిసైంది. శనివారం కూడా ఇంట్లో రీల్స్ చూస్తున్న సమయంలో, సిగ్నల్స్ సరిగ్గా రాక వీడియోలు పదేపదే ఆగిపోయాయి. నెట్వర్క్ ఆగిపోతుండటంతో తీవ్ర అసహనానికి లోనైన మంగ్లోబాయ్ ఆవేశంలో తన ఫోన్ను నేలకేసి పగలగొట్టింది. అంతటితో ఆగకుండా ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగేసింది. పరిస్థితి విషమించడంతో కుటుంబసభ్యులు వెంటనే స్థానిక ఆస్పత్రికి, అక్కడి నుంచి కోర్బాలోని మెడికల్ కాలేజీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిందని పోలీసులు వెల్లడించారు.

## పిరికి జడ్జి అనిపించుకోవడం కన్నా చావడం మేలు

### 4నెలల్లో 23 మరణశిక్షలు విధించిన యూపీ జడ్జి రవి

**ముజఫర్నగర్:** గడిచిన నాలుగు నెలల్లో 22మందికి మరణశిక్ష విధించి వార్తల్లో నిలిచిన ఉత్తరప్రదేశ్లోని ముజఫర్నగర్ జిల్లా అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి రవికుమార్ తాజాగా మరొక వ్యక్తికి ఉరిశిక్ష వేశారు. కట్నం కోసం భార్యను సజీవ దహనం చేసిన నదీమ్ అనే దోషికి మంగళవారం మరణ శిక్ష విధిస్తూ తీర్పును వెలువరించారు. "ఆ జడ్జి పిరికివాడు అనిపించుకోవడం కంటే చావడం మేలు" అని ఆ తీర్పు సందర్భంగా వ్యాఖ్యానించారు. తనకు మాఫియా, గ్యాంగ్స్టర్లు, క్రిమినల్స్ నుంచి బెదిరింపులు వస్తున్నాయని తెలిపారు. తన విధులు నిర్వర్తించకుండా వారు ఉన్నతాధికారుల సాయంతో ఒత్తిడి తెస్తున్నారని, సీరియస్ నేరాలకు సంబంధించిన దాదాపు వంద కేసులను తన బెంచ్ నుంచి తప్పించారని ఆరోపించారు. కాగా, అధికారులు రవికుమార్ భద్రతను కూడా తగ్గించినట్లు తెలిసింది. దీనిపై ఆయన అభ్యంతరం తెలిపారని, భద్రతను పెంచాలని అధికారులను కోరారని సమాచారం.

## ప్రత్యేక ప్రాంతాలుగా అరుణాచల్, అక్సాయ్చిన్

### అక్సాయ్చిన్కు పశ్చిమాన భారత్, తూర్పున చైనా

### ఐక్యరాజ్యసమితి కొత్త మ్యాప్లో ప్రత్యక్షం..!?

**న్యూఢిల్లీ :** ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన కొత్త ప్రపంచ పటం మరోసారి చర్చనీయాంశంగా మారింది. 'కరెక్ట్ ది మ్యాప్' తీర్మానానికి భారత్ మద్దతు తెలిపిన నేపథ్యంలో వెలువడిన ఈ మ్యాప్లో అరుణాచల్ప్రదేశ్, అక్సాయ్చిన్లను భారత్, చైనా వాదిస్తున్న సరిహద్దుల మధ్య ప్రత్యేక ప్రాంతాలుగా చూపించారు. అక్సాయ్చిన్ను లడఖ్లో భాగంగా భారత్ పేర్కొంటున్న విషయం తెలిసిందే. ఐరాస సర్వసభ్య సమావేశం తీర్మానంపై చర్చలు జరుగుతున్న సమయంలో జులై 1న ఈ మ్యాప్ను తొలిసారి విడుదల చేశారు. ఇందులో అరుణాచల్ప్రదేశ్కు నాగాలాండ్తో ఉన్న సరిహద్దును తొలగించారు. అరుణాచల్ప్రదేశ్ను ప్రత్యేక రాష్ట్రంగా చూపిస్తూ.. పశ్చిమాన అసోం, ఉత్తరాన చైనా సరిహద్దుగా ఉన్నట్లు మ్యాప్లో పేర్కొన్నారు. అదే విధంగా అక్సాయ్చిన్ను కూడా ప్రత్యేక ప్రాంతంగా చూపించారు. దాని పశ్చిమ వైపు భారత్, తూర్పు వైపు చైనా సరిహద్దులు ఉన్నట్లు మ్యాప్లో పేర్కొన్నారు. ఈ మార్పులు ఎందుకు చేశారన్న దానిపై ఐరాస ఎలాంటి వివరణ ఇవ్వలేదు. జమ్మూ కశ్మీర్ విషయంలో భారత్, పాకిస్థాన్ల మధ్య ఉన్న నియంత్రణ రేఖ (ఎల్ఓసీ)ని కూడా మ్యాప్లో చుక్కల రేఖతో చూపించారు. దీనిపై మ్యాప్ కింది భాగంలో ఐరాస వివరణ ఇచ్చింది. భారత్, పాకిస్థాన్ అంగీకరించిన జమ్మూ కశ్మీర్ ఎల్ఓసీని ఈ చుక్కల రేఖ సుమారుగా సూచిస్తుందని పేర్కొంది. జమ్మూ కశ్మీర్ తుది స్థితిపై సంబంధిత పక్షాల మధ్య ఇంకా అంగీకారం కుదరలేదని తెలిపింది. ప్రపంచంలోని ప్రాంతాలను పటాల్లో మరింత కచ్చితంగా, సమానత్వంతో చూపించాలంటూ ఆఫ్రికన్ యూనియన్ మద్దతుతో తీసుకొచ్చిన 'కరెక్ట్ ది మ్యాప్' తీర్మానాన్ని ఐరాస సర్వసభ్య సమావేశం గత వారం ఆమోదించింది. ముఖ్యంగా ఆఫ్రికా ప్రాంతాల భౌగోళిక చిత్రణను మరింత సమానంగా చూపించడమే దీని లక్ష్యం. ఈ తీర్మానం చట్టబద్ధంగా అమలు చేయాల్సినది కాదు. అయితే ప్రపంచవ్యాప్తంగా బహుళపక్ష సంస్థలు ఉపయోగించే ప్రామాణిక ప్రపంచ పటాల్లో దీనికి అనుగుణంగా మార్పులు చేసే అవకాశం ఉంది. ఆఫ్రికన్ గ్రూప్ తరఫున టోగో ఈ తీర్మానాన్ని ముందుకు తీసుకెళ్లింది. భారత్ దీనికి మద్దతు తెలిపింది. సమాన విస్తీర్ణాన్ని ప్రతిబింబించే పటాల రూపకల్పన అనే మౌలిక సూత్రానికి మద్దతుగా తాము ఓటు వేసినట్లు భారత విదేశాంగ శాఖ తెలిపింది. ఏదైనా నిర్దిష్ట పటం, మ్యాప్ ప్రొజెక్షన్ లేదా దేశాల సరిహద్దుల చిత్రణకు ఈ తీర్మానం ఆమోదం కాదని స్పష్టం చేసింది. జమ్మూ కశ్మీర్, లడఖ్ కేంద్రపాలిత ప్రాంతాలు సహా భారత సార్వభౌమ భూభాగాన్ని అధికారిక భారత పటం ప్రకారమే చూపించాలని పేర్కొంది. తప్పుడు లేదా తప్పుదోవ పట్టించే చిత్రణను అంగీకరించబోమని తెలిపింది.

## ఇజ్రాయెల్ సెటిల్మెంట్లపై యూకే కఠిన చర్యలు

### ఇజ్రాయెల్కు భారీ దౌత్యపరమైన ఎదురుదెబ్బ

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ వేదికపై ఇజ్రాయెల్కు భారీ దౌత్యపరమైన ఎదురుదెబ్బ తగిలింది. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్లోని ఇజ్రాయెల్ సెటిల్మెంట్లతో వాణిజ్య సంబంధాలపై బ్రిటన్ (యూకే) ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ సెటిల్మెంట్ల నుంచి వచ్చే అన్ని రకాల వస్తువుల దిగుమతితో పాటు ఫైనాన్సింగ్, నిర్మాణ రంగం వంటి సేవలను తక్షణమే నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. బ్రిటన్ తీసుకున్న ఈ కీలక నిర్ణయానికి ఫ్రాన్స్, కెనడా సైతం మద్దతు ప్రకటించడమే కాకుండా, తాము కూడా ఈ నిషేధంలో భాగస్వామ్యం పంచుకోనున్నట్లు వెల్లడించాయి. వెస్ట్ బ్యాంక్లోని పలు ప్రాంతాల్లో 'సెటిలర్ టెర్రరిస్టులు' పాలస్తీనియన్లపై జాతి నిర్మూలనకు పాల్పడుతున్నారని బ్రిటన్ విదేశాంగ మంత్రి ఎడ్ మిలిబాండ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పాలస్తీనా ప్రజల ఇళ్లను కూల్చివేయడం, రహదారులు, మౌలిక సదు-పాయాలను ధ్వంసం చేయడం వంటి చర్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. అంతర్జాతీయ సమాజం కళ్లముందే పాలస్తీనాలో జరుగుతున్న ఈ పరిణామాల పట్ల తాను సిగ్గుపడుతున్నానని ఆయన పేర్కొన్నారు. ప్రధాని ఆండీ బర్న్హమ్ నేతృత్వంలోని లేబర్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇజ్రాయెల్ విషయంలో యూకే తన విదేశాంగ విధానంలో తీసుకొచ్చిన అతిపెద్ద మార్పుగా దీనిని విశ్లేషకులు భావిస్తున్నారు. గత ఏడాది బ్రిటన్ ప్రభుత్వం పాలస్తీనాను ఒక స్వతంత్ర దేశంగా గుర్తించిన విషయం ఈ సందర్భంగా గమనార్హం. బ్రిటన్ నిర్ణయంపై ఇజ్రాయెల్, అమెరికా దేశాలు తీవ్రంగా స్పందించాయి. ఇది 'తీవ్రమైన తప్పుడు అంచనా' అని, తమ ప్రజాస్వామ్య ప్రక్రియలో జోక్యం చేసుకోవడమేనని ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్ మండిపడ్డారు. "బ్రిటన్ మాకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే, మేము కూడా బ్రిటన్కు వ్యతిరేకంగా కఠిన చర్యలు తీసుకుంటాం" అని ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి గిడియాన్ సార్ హెచ్చరించారు. ఇజ్రాయెల్లోని అమెరికా రాయబారి మైక్ హకబీ ఈ చర్యను 'యూదు ప్రజలపై చూపిస్తున్న వివక్ష'గా అభివర్ణించారు. దీనికి ప్రతిగా అమెరికా నుంచి ప్రతీకార చర్యలు ఉండవచ్చని ఆయన సంకేతాలిచ్చారు. ఈ ఉద్రిక్త పరిణామాల నేపథ్యంలో, బ్రిటన్ ప్రధాని ఆండీ బర్న్హామ్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్తో సోమవారం ఫోన్లో మాట్లాడినట్లు ప్రధాని కార్యాలయం తెలిపింది.

## తిరునల్వేలి గ్యాంగ్రేప్ కేసులో దోషికి ఉరిశిక్ష

### తీర్పు వెలువరించిన పోక్సో కోర్టు సంచలన

**తిరునల్వేలి :** మైనర్పై సామూహిక అత్యాచారానికి పాల్పడిన కేసులో తమిళనాడులోని తిరునల్వేలి పోక్సో ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో ఒక దోషికి మరణశిక్ష విధిస్తూ, మరో ఇద్దరికి కఠిన కారాగార శిక్షలను ఖరారు చేస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే, 2022లో తిరునల్వేలికి చెందిన 16 ఏళ్ల బాలికకు ఓ ప్రార్థనా స్థలంలో విలాతికుళానికి చెందిన పెయింటర్ మునీశ్వరన్ (25) పరిచయమయ్యాడు. ఫోన్ నంబర్లు మార్చుకున్నాక వారిద్దరూ సుమారు రెండు వారాల పాటు మాట్లాడుకున్నారు. ఆ తర్వాత, పెళ్లి చేసుకుంటానని నమ్మబలికిన మునీశ్వరన్, సదరు బాలికను తన ద్విచక్ర వాహనంపై మీనాక్షిపురంలోని తన సోదరి నివాసానికి తీసుకెళ్లి, అక్కడ ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం మునీశ్వరన్ తన స్నేహితులైన చిన్నకుట్టి (28), మురుగేశన్ (23)లను అక్కడికి పిలిపించాడు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం, వారు కూడా బాలికపై లైంగిక దాడికి ఒడిగట్టారు. ఈ దారుణం గురించి బాధితురాలు తన తల్లిదండ్రులకు తెలపడంతో, వారు పాళయంకోట్టై మహిళా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ కేసుపై సమగ్ర విచారణ జరిపిన ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సురేశ్ కుమార్ మంగళవారం తుది తీర్పు వెలువరించారు. నిందితుడు చిన్నకుట్టికి మరణశిక్ష విధించగా, మురుగేశన్కు 20 ఏళ్లు, మునీశ్వరన్కు 13 ఏళ్ల కఠిన కారాగార శిక్ష ఖరారు చేస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది.

## రెండో రోజూ నష్టాల బాటలో మార్కెట్లు

**న్యూఢిల్లీ :** అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలు పెరగడం, భౌగోళిక ఉద్రిక్తతలు కొనసాగుతుండటంతో దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజూ నష్టాల్లో ముగిశాయి. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ జూన్ మధ్య నుంచి చూస్తే కనిష్ఠ స్థాయికి చేరాయి. బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగాల షేర్లలో అమ్మకాలు మార్కెట్లపై మరింత ఒత్తిడి పెంచాయి. సెన్సెక్స్ 555.23 పాయింట్లు పతనమై 75,577.58 వద్ద ముగిసింది. నిఫ్టీ 144.05 పాయింట్లు కోల్పోయి 23,635.10 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 0.73 శాతం, నిఫ్టీ 0.61 శాతం చొప్పున నష్టపోయాయి. నిఫ్టీలో ఎస్బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ప్రైవేట్ బ్యాంక్, ఫైనాన్షియల్ సర్వీసెస్ సూచీలు ఎక్కువగా పడిపోయాయి. మరోవైపు ఫార్మా, హెల్త్కేర్ రంగాలు కొంత మద్దతు ఇచ్చాయి. అయితే మిడ్క్యాప్, స్మాల్క్యాప్ సూచీలు మాత్రం స్వల్ప లాభాలతో ముగిశాయి. నిఫ్టీ మిడ్క్యాప్ 0.21 శాతం, స్మాల్క్యాప్ 0.17 శాతం చొప్పున పెరిగాయి. చమురు ధరలు ఇదే స్థాయిలో కొనసాగితే మార్కెట్లో ఒడుదొడుకులు మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. గత ఐదు, ఆరు నెలల్లో మిడ్, స్మాల్క్యాప్ షేర్లు భారీగా రాణించడంతో ఇకపై వాటి జోరు కొనసాగడం కష్టమేనని అభిప్రాయపడుతున్నారు. పెద్ద కంపెనీల షేర్లు, ఈక్విటీ ఆధారితేతర ఈటీఎఫ్ల వైపు దృష్టి పెట్టడం సురక్షితమని సూచిస్తున్నారు. ఇదిలా ఉంటే రూపాయి విలువ కూడా బలహీనపడింది. డాలర్తో పోలిస్తే రూపాయి 0.29 శాతం క్షీణించి 94.81 వద్ద ట్రేడైంది. డాలర్ 98.95 సమీపంలో ఉండగా.. బ్రెంట్ క్రూడ్ ధర 97 డాలర్ల వద్ద కొనసాగింది.


# భారత్‌తో చారిత్రాత్మక ఏకైక టీ20 మ్యాచ్‌కు జట్టును ప్రకటించిన జపాన్




క్రికెట్ ప్రపంచంలో ఒక చారిత్రాత్మక ఘట్టానికి రంగం సిద్ధమైంది. రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన భారత జట్టు, తొలిసారిగా జపాన్‌తో అంతర్జాతీయ టీ20 మ్యాచ్ ఆడనుంది. ఇరు దేశాల మధ్య 75 ఏళ్ల దౌత్య సంబంధాల వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ ప్రత్యేక మ్యాచ్‌ను నిర్వహిస్తున్నారు. సెప్టెంబర్ 22న టోచిగి ప్రిఫెక్చర్‌లోని సానో అంతర్జాతీయ క్రికెట్ గ్రౌండ్‌లో ఈ మ్యాచ్ జరగనుంది. ఈ చారిత్రక మ్యాచ్‌కు 'సుజుకీ కప్' అని పేరు పెట్టారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ, జపాన్ ప్రధాని సనే టకాయిచి మధ్య జరిగిన శిఖరాగ్ర సమావేశంలో కుదిరిన ఒప్పందం మేరకు 'స్పోర్ట్ 75' అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇరు దేశాల మధ్య క్రీడా రంగంలో సహకారాన్ని, సాంస్కృతిక మార్పిడిని ప్రోత్సహించడమే దీని లక్ష్యం. ఈ బృహత్తర కార్యక్రమంలో భాగంగానే ఈ టీ20 మ్యాచ్‌ను నిర్వహిస్తున్నారు. ఈ మ్యాచ్ ద్వారా జపాన్, తూర్పు ఆసియా దేశాల్లో క్రికెట్‌కు మరింత ప్రాచుర్యం కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మ్యాచ్ కోసం జపాన్ తమ జట్టును ప్రకటించింది. మరో రెండు రోజుల్లో ప్రారంభం కానున్న ఆసియా క్రీడల కోసం ఎంపిక చేసిన జట్టునే ఈ మ్యాచ్‌కు కూడా ఎంపిక చేయడం విశేషం. టీ20 ఫార్మాట్‌లో జపాన్ తరఫున అత్యధిక పరుగులు చేసిన కెండెల్ కడోవాకీ-ఫ్లెమింగ్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. స్పిన్ బౌలింగ్ ఆల్ రౌండర్ జేక్ కుసుడా-నైర్న్ తొలిసారిగా జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఆసియా క్రీడల సన్నద్ధతకు ప్రాధాన్యత ఇస్తున్నందున, ఐసీసీ నిబంధనల ప్రకారం అర్హత ఉండి, ఆసియా క్రీడల నిబంధనల ప్రకారం అనర్హులైన ఆటగాళ్లను ఈ మ్యాచ్‌కు ఎంపిక చేయలేదని అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. కెప్టెన్ ఫ్లెమింగ్‌తో పాటు ఇబ్రహీం తకహాషి, డెక్లాన్ సుజుకీ-మెక్‌కోంబ్ వంటి 50కి పైగా టీ20లు ఆడిన అనుభవజ్ఞులు జట్టులో ఉన్నారు. 2013లో తొలిసారి జపాన్‌కు ప్రాతినిధ్యం వహించిన సుయోషి టకాడా తిరిగి జట్టులోకి వచ్చాడు. ఈ చారిత్రక మ్యాచ్‌పై బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా హర్షం వ్యక్తం చేశారు. "భారత్, జపాన్ మధ్య జరుగుతున్న ఈ ప్రత్యేక టీ20 మ్యాచ్‌లో భాగం కావడం చాలా సంతోషంగా ఉంది. భారత జట్టు ఒక కొత్త దేశంలో అడుగు పెడుతుండటం క్రికెట్‌కు ఒక ముఖ్యమైన ఘట్టం. ఇరు దేశాల మధ్య బలమైన స్నేహబంధం ఉంది. 75 ఏళ్ల మైత్రి వేడుకల్లో క్రికెట్‌ను భాగం చేసినందుకు జపాన్ క్రికెట్ అసోసి యేషన్‌కు ధన్యవాదాలు'' అని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

**జపాన్ జట్టు:**

కెండెల్ కడోవాకీ-ఫ్లెమింగ్ (కెప్టెన్), చార్లీ హారా-హింజే, బెంజమిన్ ఇటో-డేవిస్, అలెస్టిర్ కడోవాకీ-ఫ్లెమింగ్, కోహె కుబోటా, జేక్ కుసుడా-నైర్న్, వటారు మియౌచి (వికెట్ కీపర్), రియో సకురానో-థామస్, అలెక్స్ షిరాయ్-పాట్‌మోర్ (వికెట్ కీపర్), షోమా సుగయా-స్లేటర్, డెక్లాన్ సుజుకీ-మెక్‌కోంబ్, సుయోషి టకాడా, ఇబ్రహీం తకహాషి, మకోటో తానియామా, లాచ్‌లాన్ యమమోటో-లేక్.



# అలాంటప్పుడే నా బెస్ట్ గేమ్ బయటకొస్తుంది

## ఇషాన్ కిషన్ ఆసక్తికర వ్యాఖ్యలు

కీలక మ్యాచ్‌లలో ఒత్తిడి పెరిగినప్పుడే తనలోని అత్యుత్తమ ఆట బయటకు వస్తుందని భారత బ్యాటర్, ఈస్ట్ జోన్ కెప్టెన్ ఇషాన్ కిషన్ అన్నాడు. దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్‌పై 270 పరుగుల భారీ ఇన్నింగ్స్ ఆడిన తర్వాత అతడు తన ఆటతీరుపై ఆసక్తికర విషయాలు వెల్లడించాడు. చెపాక్‌లో జరిగిన మ్యాచ్‌లో కిషన్ 334 బంతుల్లో 270 పరుగులు చేశాడు. ఇందులో 30 ఫోర్లు, 7 సిక్సర్లు ఉన్నాయి. అతడి ఇన్నింగ్స్‌తో ఈస్ట్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 708 పరుగుల భారీ స్కోరు సాధించింది. దులీప్ ట్రోఫీ చరిత్రలో అత్యధిక వ్యక్తిగత స్కోర్ల జాబితాలో కిషన్ 270 పరుగులు ఎనిమిదో స్థానంలో నిలిచాయి. పెద్ద మ్యాచ్‌లలో ఒత్తిడి తన ఆటకు మరింత ఉపయోగపడుతుందని కిషన్ చెప్పాడు. వికెట్లు త్వరగా పడిపోయిన సందర్భాల్లో కూడా తాను బ్యాటింగ్‌ను ఆస్వాదిస్తానన్నాడు. ప్రశాంతంగా ఉంటూనే దూకుడుగా ఆడటం తనకు బాగా కలిసొస్తుందని వివరించాడు. తన వ్యక్తిగత స్కోరుపై కాకుండా జట్టు లక్ష్యంపై దృష్టి పెట్టినట్లు కిషన్ తెలిపాడు. 400 పరుగులు పూర్తయితే ముందుగా 450కి చేరుకోవాలని.. తర్వాత 500 పరుగుల లక్ష్యాన్ని పెట్టుకున్నట్లు చెప్పాడు. ఇలా చిన్న చిన్న లక్ష్యాలుగా విడగొట్టుకోవడం వల్లే సుదీర్ఘ ఇన్నింగ్స్ ఆడగలిగానన్నాడు. చెపాక్‌లో పరిస్థితులు బ్యాటర్లకు అంత సులభంగా లేవని కిషన్ చెప్పాడు. మైదానం ఒకవైపు బౌండరీ చాలా దూరంగా ఉండటంతో షాట్లకు ఎక్కువ శ్రమ పెట్టాల్సి వచ్చిందన్నాడు. బంతి మెత్తబడటంతో బౌండరీలు సాధించడం మరింత కష్టంగా మారిందని తెలిపాడు. మహ్మద్ సిరాజ్ షార్ట్ బాల్స్ వేసినప్పుడు వికెట్ కోల్పోకుండా ఉండేందుకు తన బ్యాటింగ్ భంగిమను మార్చుకున్నట్లు కిషన్ చెప్పాడు. బంతిని బలంగా కొట్టే ప్రయత్నంలో వికెట్ చేజారకుండా జాగ్రత్త పడ్డానన్నాడు. కుమార్ కుషాగ్రతో కలిసి కిషన్ కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. కుషాగ్ర 132 బంతుల్లో 101 పరుగులు చేశాడు. ఆ తర్వాత కూడా కిషన్ అదే జోరును కొనసాగించాడు. 270 పరుగుల వద్ద లాంగ్‌ఆన్ సమీపంలో క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ట్రిపుల్ సెంచరీకి అతడు 30 పరుగుల దూరంలో నిలిచిపోయాడు. తన భారీ ఇన్నింగ్స్‌లో షాట్లు ఆడేందుకు పెద్దగా రిస్క్ తీసుకోలేదని కిషన్ చెప్పాడు. సరైన బంతులను ఎంచుకుని ఆడటం తనకు ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చిందన్నాడు.

# గిల్ మెరుపు హాఫ్ సెంచరీ వృథా..

## అభిషేక్ శర్మ జట్టు ఘన విజయం



షేర్-ఎ-పంజాబ్ టీ20 లీగ్‌లో భాగంగా జరిగిన కీలక మ్యాచ్‌లో శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలోని ఫాజిల్కా ఫాల్కన్స్‌పై అభిషేక్ శర్మ జట్టు అమృత్‌సర్ సూర్మాస్ 4 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో అమృత్‌సర్ తమ సెమీఫైనల్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. మొహాలీలోని ఐఎస్ బింద్రా స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో సూర్మాస్ ఆకట్టుకుంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఫాజిల్కా ఫాల్కన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 191 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఆరంభంలో 20 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన ఫాజిల్కాను కెప్టెన్ శుభ్‌మన్ గిల్, ప్రాన్ష ప్రతాప్ ఆదుకున్నారు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 72 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన గిల్ కేవలం 35 బంతుల్లో 67 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. గిల్ ఔటయ్యాక, ప్రాన్ష (33 బంతుల్లో 40) బాధ్యతాయుతంగా ఆడగా, చివర్లో సంవీర్ సింగ్ (21 బంతుల్లో 40) మెరుపు ఇన్నింగ్స్‌తో ఫాజిల్కా భారీ స్కోరు సాధించడంలో కీలకపాత్ర పోషించాడు. అమృత్‌సర్ బౌలర్లలో మయాంక్ మార్కండే వికెట్ తీయకపోయినా, 4 ఓవర్లలో కేవలం 26 పరుగులు ఇచ్చి పొదుపుగా బౌలింగ్ చేశాడు. 192 పరుగుల లక్ష్య ఛేదనలో అమృత్‌సర్ సూర్మాస్‌కు ఓపెనర్లు అభిషేక్ శర్మ, సహజ్ ధావన్ అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చారు. ముఖ్యంగా అభిషేక్ శర్మ కేవలం 15 బంతుల్లో 49 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. దీంతో తొలి వికెట్‌కు 79 పరుగుల భాగస్వామ్యం నమోదైంది. అయితే అభిషేక్ ఔటయ్యాక, అమృత్‌సర్ వరుసగా వికెట్లు కోల్పోయి 152/5తో కష్టాల్లో పడింది.

ఈ దశలో క్రీజులోకి వచ్చిన రాహుల్ కుమార్, బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో జట్టును గెలుపు తీరాలకు చేర్చాడు. ఒత్తిడిలో సంయమనం పాటిస్తూ అజేయంగా 35 బంతుల్లో 53 పరుగులు చేసి జట్టుకు విజయాన్ని అందించాడు. కీలక సమయంలో అర్ధశతకం పూర్తి చేసుకుని, మరో వికెట్ పడకుండా అమృత్‌సర్‌ను గెలిపించాడు.

# ఆసియా కప్ ట్రోఫీ వద్దు.. భారత్‌ను ఓడించాలన్న పాక్ అభిమాని..

## టీమిండియా ఫ్యాన్స్ కౌంటర్



మహిళల ఆసియా కప్ 2026 టోర్నీ సందర్భంగా పాకిస్థాన్‌కు చెందిన ఓ అభిమాని చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీశాయి. దీనిపై భారత క్రికెట్ అభిమానులు తమదైన శైలిలో ధీటుగా బదులిస్తున్నారు. దుబాయ్ వేదికగా హాంగ్‌కాంగ్‌తో జరిగిన ఆఖరి గ్రూప్ మ్యాచ్‌లో 72 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించిన పాకిస్థాన్ మహిళల జట్టు సెమీ ఫైనల్‌కు అర్హత సాధించింది. ఈ మ్యాచ్ అనంతరం పాక్ జట్టు హెడ్ కోచ్ వహాబ్ రియాజ్‌తో ఓ అభిమాని మాట్లాడుతూ, "మాకు ఆసియా కప్ ట్రోఫీ అవసరం లేదు, భారత జట్టును ఓడిస్తే చాలు" అని కోరాడు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వ్యాఖ్యలపై టీమిండియా అభిమానులు ఘాటుగా స్పందిస్తున్నారు. "వారు క్రికెట్‌ను యుద్ధంలా, యుద్ధాన్ని ఆటలా పరిగణిస్తారు. కానీ రెండు చోట్లా వారికి ఓటమి తప్పదు'' అని ఒకరు వ్యాఖ్యానించగా, "మొన్నటి ఓటమి షాక్ ఇంకా సరిపోలేదా? ఫైనల్‌కు రండి, ఈసారి టీమిండియా అంతకంటే గట్టిగా బుద్ధి చెబుతుంది" అంటూ మరొక అభిమాని ఎద్దేవా చేశాడు. ప్రస్తుతం భారత్, పాకిస్థాన్ జట్లు సెమీ ఫైనల్‌కు చేరుకున్నాయి. సెప్టెంబర్ 10న జరగనున్న సెమీస్‌లో బంగ్లాదేశ్ లేదా యూఏఈ విజేతతో భారత్ తలపడనుంది. మరో సెమీ ఫైనల్‌లో పాకిస్థాన్ జట్టు శ్రీలంకను ఢీకొట్టనుంది. ఈ రెండు మ్యాచుల్లోనూ భారత్, పాకిస్థాన్ విజయం సాధిస్తే, సెప్టెంబర్ 13న జరిగే ఫైనల్‌లో దాయాదుల మధ్య మరో హై వోల్టేజ్ పోరు ఖాయం కానుంది.

# వయసు చిన్నది, క్రికెట్ తెలివి పెద్దది..

## డీఆర్ఎస్ పై కెప్టెన్‌ను ఒప్పించిన యంగ్ సెన్సేషన్!




వయసు 15 ఏళ్లే కావచ్చు, కానీ మైదానంలో అతని క్రికెట్ పరిణతి, వ్యూహాత్మక ఆలోచన సీనియర్లను సైతం ఆశ్చర్యపరుస్తోంది. దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో ఈస్ట్ జోన్ యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ తన అద్భుతమైన క్రికెట్ అవగాహనతో మరోసారి అందరి దృష్టినీ ఆకర్షించాడు. కెప్టెన్ ఇషాన్ కిషన్‌ను ఒప్పించి 'డెసిషన్ రివ్యూ సిస్టమ్' (డీఆర్ఎస్) తీసుకునేలా చేసి, కీలక వికెట్ పడగొట్టడంలో ముఖ్య పాత్ర పోషించాడు. ఈస్ట్ జోన్ తన తొలి ఇన్నింగ్స్‌లో 708 పరుగుల భారీ స్కోరు సాధించడంతో సౌత్ జోన్‌పై తీవ్రమైన ఒత్తిడి నెలకొంది. లక్ష్య ఛేదనకు దిగిన సౌత్ జోన్ ఇన్నింగ్స్ ఆరో ఓవర్‌లో ఈ సంఘటన చోటుచేసుకుంది. ముఖేశ్ కుమార్ వేసిన బంతి బ్యాటర్ రికీ భుయ్ బ్యాట్‌ను తాకినట్లు అనిపించినా, ఫీల్డ్ అంపైర్ నాటౌట్‌గా ప్రకటించాడు. అయితే, స్లిప్‌లో ఫీల్డింగ్ చేస్తున్న వైభవ్ సూర్యవంశీ మాత్రం బంతి బ్యాట్‌కు కచ్చితంగా తగిలిందని గట్టిగా నమ్మాడు. 'తీసుకో.. తీసుకో' అంటూ కెప్టెన్ ఇషాన్ కిషన్‌ను పదేపదే కోరాడు. తన వైస్ కెప్టెన్ మీద నమ్మకముంచిన కిషన్ రివ్యూకు వెళ్లాడు. అల్ట్రాఎడ్జ్‌లో బంతి బ్యాట్‌ను తాకినట్లు స్పష్టంగా కనిపించడంతో రికీ భుయ్ పెవిలియన్‌కు చేరాడు. ఇలాంటి అద్భుతమైన క్రికెట్ అవగాహనను వైభవ్ ప్రదర్శించడం ఇదే మొదటిసారి కాదు. సెంట్రల్ జోన్‌తో జరిగిన సెమీ ఫైనల్‌లో కెప్టెన్ ఇషాన్ కిషన్ వేలి గాయంతో మైదానం వీడినప్పుడు, వైభవ్ తాత్కాలిక కెప్టెన్‌గా బాధ్యతలు తీసుకున్నాడు. ఆ సమయంలోనూ ఆర్యన్ జుయల్ క్యాచ్ ఔట్‌పై రివ్యూ తీసుకుని సఫలమయ్యాడు. ఆ స్థాయిలో కెప్టెన్‌గా అతను తీసుకున్న తొలి విజయవంతమైన రివ్యూ అదే. అయితే, ఫైనల్‌లో అతని రెండో అంచనా ఫలించలేదు. మహమ్మద్ కౌనైన్ ఖురేషీ బౌలింగ్‌లో దేవదత్ పడిక్కల్ ప్యాడ్లకు బంతి తగలడంతో, ఎల్బీడబ్ల్యూ కోసం మరోసారి కిషన్‌ను రివ్యూకు ఒప్పించాడు. కానీ, బాల్ ట్రాకింగ్‌లో బంతి వికెట్లను మిస్ అవుతున్నట్లు తేలడంతో ఈస్ట్ జోన్ ఒక రివ్యూను కోల్పోయింది. అయినప్పటికీ పడిక్కల్ (62) వికెట్‌ను ముఖేష్ కుమార్ తీయడంతో సౌత్ జోన్ 128/3 స్కోరు వద్ద నిలిచింది. ఈస్ట్ జోన్ భారీ స్కోరులో ఇషాన్ కిషన్ (270) మారథాన్ ఇన్నింగ్స్‌తో పాటు శిఖర్ మోహన్ (85), అభిమన్యు ఈశ్వరన్ (72), కుమార్ కుశాగ్ర (101) రాణించారు. వైభవ్ సూర్యవంశీ కూడా కేవలం 37 బంతుల్లో 44 పరుగులు చేసి తన వంతు పాత్ర పోషించాడు. క్వార్టర్ ఫైనల్‌లో 8 పరుగులే చేసినప్పటికీ, సెమీ ఫైనల్‌లో 92 పరుగులతో ఫామ్‌లోకి వచ్చాడు. మొత్తంగా నాలుగు ఇన్నింగ్స్‌లలో 46 సగటుతో 184 పరుగులు చేశాడు. సీనియర్ డొమెస్టిక్ క్రికెట్‌లో తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటున్న ఈ యువ కెరటం.. కేవలం పరుగులతోనే కాకుండా, తన అమోఘమైన క్రికెట్ వ్యూహాలతోనూ ఈస్ట్ జోన్‌కు అమూల్యమైన ఆస్తిగా మారుతున్నాడని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.


# చీరకట్టులో ఆకట్టుకుంటున్న ఆషికా రంగనాథ్

కన్నడ నటిగా పాపులారిటీ అందుకున్న ఆషికా రంగనాథ్ తొలిసారి కళ్యాణ్ రామ్ కథానాయకుడిగా వచ్చిన అమిగోస్ అనే చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులను పలకరించింది. సినిమా డిజాస్టర్ గా నిలిచినా అందరి దృష్టి అమ్మడి పైనే. తన నటనతో, అందంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈమె.. మళ్లీ 2026లో భర్త మహాశయులకు విజ్ఞప్తి అనే సినిమాలో నటించింది . ఈ సినిమా కూడా పెద్దగా ప్రేక్షకులను ఆకట్టుకోలేదు. ప్రస్తుతం వశిష్ట మల్లిడి దర్శకత్వంలో విశ్వంభర అనే సినిమా చేస్తోంది. కానీ ఈ సినిమా విడుదలకు నోచుకోలేదు. దీంతో రూట్ మార్చిన ఈమె.. తమిళంలో తాజాగా నటిస్తున్న చిత్రం సర్దార్ 2 . సెప్టెంబర్ 10వ తేదీన ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో అటు ప్రమోషనల్ కార్యక్రమాలతో పాటు ఇటు సోషల్ మీడియా వేదికగా సందడి చేస్తూ అలరిస్తోంది. ఈ మేరకు తాజాగా చీరకట్టులో ఆడియన్స్ ను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది ఆషికా రంగనాథ్. బ్లాక్ అండ్ వైట్ జీబ్రా కలర్స్ తో డిజైన్ చేసిన జార్జెట్ చీర కట్టుకున్న ఈమె.. దీనికి కాంబినేషన్లో పోల్కా డాటెడ్ తో డిజైన్ చేసిన డీప్ రౌండ్ నెక్ కలిగిన బ్లౌజ్ ధరించి తన అందాలను ఫుల్ ఫిల్ చేసుకుంది. హైదరాబాదులో సెప్టెంబర్ 7న జరిగిన సర్దార్- 2 ప్రీ రిలీజ్ ఈవెంట్ కోసం ఇలా ముస్తాబయింది ఈ ముద్దుగుమ్మ. చీర కట్టులో నడుము అందాలతో చక్కగా ప్రేక్షకులను మైమరిపింప చేసిన ఆషికా రంగనాథ్ ఈ ఫోటోలకు క్యాప్షన్ గా సినిమాటిక్ గా ఉందా? హైదరాబాదులో సర్దార్ 2 ప్రీ రిలీజ్ ఈవెంట్ కోసం ఈ లుక్ అంటూ షేర్ చేసిన క్యాప్షన్ ఆకట్టుకుంటుంది. మొత్తానికి అయితే ఆషికా రంగనాథ్ షేర్ చేసిన ఈ లేటెస్ట్ అవుట్ ఫిట్ ఫోటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఇకపోతే ప్రీ రిలీజ్ ఈవెంట్లో తన అంద చందాలతో ఆషికా ఆకట్టుకున్న విషయం తెలిసిందే.




# నాని పారడైజ్ రిలీజ్ కి ప్లాన్ ఏ ప్లాన్ బీ?

నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతోన్న భారీ చిత్రం -ది పారడైజ్- పై ఎలాంటి అంచనాలున్నాయో చెప్పాల్సిన పనిలేదు. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రచార చిత్రాలతో ప్యారడేజ్ పై కాక మామూలుగా లేదు. పైగా ఇద్దరు -దసరా- తర్వాత చేస్తోన్న ప్రాజెక్ట్ కావడంతో? అంచనాలు పీక్స్ లో ఉన్నాయి. అయితే ఈ సినిమా విడుదల తేదీకి సంబంధించి చిత్రబృందం రెండు రకాల వ్యూహాలను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్లాన్ ఏ ప్రకారం ఈ సినిమా సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రావాల్సి ఉంది. ఒకవేళ ప్లాన్ ఏ వర్కవుట్ అయి సెప్టెంబర్ 24 పారడైజ్ విడుదలయితే దానికి అనుగుణంగా ఇతర సినిమాల విడుదల తేదీల్లో కూడా మార్పులు చోటుచేసుకుంటాయి.ల విక్టరీ వెంకటేష్ నటిస్తోన్న -ఆదర్శ కుటుంబం- చిత్రం అక్టోబర్ 2న రావాల్సి ఉండగా బాక్సాఫీస్ క్లాష్‌ను నివారించేందుకు వారం ఆలస్యంగా అక్టోబర్ 9కి వాయిదా పడే అవకాశం ఉంది. ఒకవేళ సాంకేతిక కారణాలు లేదా పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఆలస్యం వల్ల అనుకున్న సమయానికి ప్యారడైజ్ సిద్ధం కాకపోతే ప్లాన్ బీ ని అమలు చేయాలని మేకర్స్ భావిస్తున్నారు. ప్లాన్ బీ ప్రకారం -ది పారడైజ్- చిత్రాన్ని వాయిదా వేసి గాంధీ జయంతి కానుకగా అక్టోబర్ 1న విడుదల చేస్తారు. ఈ వ్యూహం అమలులోకి వస్తే బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోరాటం నెలకొంటుంది. ఒకవేళ ప్లాన్ దీ అమలులోకి వచ్చి అక్టోబర్ 1న -ది పారడైజ్- థియేటర్లలోకి వస్తే మరుసటి రోజే అక్టోబర్ 2న వెంకటేష్ చిత్రం -ఆదర్శ కుటుంబం- కూడా ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో దసరా పండుగ రేసులో నాని, వెంకటేష్ చిత్రాల మధ్య బాక్సాఫీస్ సమరం నెలకొనడం ఖాయంగా చెప్పొచ్చు. పెద్ద పండుగ సీజన్ కావడంతో ఈ రెండు చిత్రాలకు మంచి వసూళ్లు వచ్చే అవకాశం ఉన్నా? థియేటర్ల కేటాయింపులో పోటీ తప్పదు. రెండు పెద్ద సినిమాలు ఒక్క రోజు వ్యవధిలో విడుదల కావడం వల్ల ఓపెనింగ్స్ , థియేటర్ల లభ్యతపై ప్రభావం పడే అవకాశం ఉంది. అందుకే ప్యారడైజ్ చిత్ర యూనిట్ ముందుగా ప్లాన్ ఏ కే ప్రాధాన్యత ఇస్తోందని సమాచారం. సెప్టెంబర్ 24 నాటికే పనులన్నీ పూర్తి చేయాలనే పట్టుదలతో టీమ్ పనిచేస్తోందని సమాచారం. అదే జరిగితే రెండు సినిమాలకు తగినంత థియేటర్లు ..సోలో రన్ లభించే అవకాశం ఉంటుంది.




# టాప్ డిజాస్టర్స్.. టాక్సిక్ కొత్త రికార్డా!



యశ్ టాక్సిక్‌పై ఇప్పుడు బాక్సాఫీస్ కంటే నష్టాల లెక్కలే ఎక్కువగా వినిపిస్తున్నాయి. భారీ ఓపెనింగ్‌తో మొదలైన ఈ సినిమా తర్వాత రోజుల్లో వేగంగా పడిపోయింది. దాదాపు రూ.500 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన టాక్సిక్ వల్ల నిర్మాతలకు రూ.300 కోట్ల వరకు నష్టం రావొచ్చని ట్రేడ్ రిపోర్ట్స్ చెబుతున్నాయి. అదే జరిగితే ఇండియన్ సినిమాలో భారీ నష్టాలు తెచ్చిన సినిమాల లిస్ట్‌లో టాక్సిక్ ముందుకు వెళ్లినట్టే. టాక్సిక్ విషయంలో థియేటర్ కలెక్షన్స్ ఒక్కటే సమస్య కాలేదు. సినిమా ఓటీటీ హక్కుల కోసం మొదట రూ.200 కోట్లకు పైగా ఆశించినట్టు రిపోర్ట్స్ వచ్చాయి. కానీ థియేటర్ రిజల్ట్ తర్వాత ఇప్పుడు దాదాపు రూ.30 కోట్ల ఆఫర్లే వస్తున్నాయని బాలీవుడ్ మీడియాలో కథనాలు వచ్చాయి. పెద్ద బడ్జెట్ సినిమాకు థియేటర్ నుంచి డబ్బు తగ్గడం, ఓటీటీ డీల్ కూడా అనుకున్న స్థాయిలో లేకపోవడం రెండూ ఒకేసారి జరిగాయి. గత ఏడాది వార్ 2 కూడా భారీ నష్టాలు చూసింది. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ కలిసి నటించినా సినిమా బాక్సాఫీస్ దగ్గర అనుకున్న రేంజ్‌కు వెళ్లలేదు. కొన్ని ట్రేడ్ లెక్కల్లో థియేట్రికల్ నష్టం రూ.150 కోట్ల వరకు అని వచ్చింది. అయితే నిర్మాతలకు వచ్చిన మొత్తం నష్టంపై వేర్వేరు లెక్కలు ఉన్నాయి. సూర్య కంగువ పరిస్థితి కూడా ఇలానే అయింది. భారీ బడ్జెట్, పాన్ ఇండియా రిలీజ్‌తో వచ్చిన ఈ సినిమాకు దాదాపు రూ.135 కోట్ల వరకు నష్టం వచ్చినట్టు అప్పట్లో ట్రేడ్ రిపోర్ట్స్ వచ్చాయి. ప్రభాస్ రాధే శ్యామ్ కూడా పెద్ద బడ్జెట్‌తో తెరకెక్కి థియేటర్లలో భారీ నష్టాన్ని చూసింది. ఆ సినిమా నష్టం రూ.150 కోట్ల దగ్గర ఉండొచ్చని కొన్ని లెక్కలు చెప్పాయి. రామ్ చరణ్ గేమ్ ఛేంజర్ కూడా ఈ లిస్ట్‌లో కనిపిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా భారీ థియేట్రికల్ బిజినెస్ చేసిన ఈ సినిమా బ్రేక్ ఈవెన్‌కు చాలా దూరంలో ఆగిపోయింది. రూ.120 కోట్లకు పైగా నష్టం వచ్చిందనే లెక్కలు అప్పట్లో బయటకు వచ్చాయి. శంకర్ దర్శకత్వంలో వచ్చిన ఇండియన్ 2 కూడా నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లకు పెద్ద దెబ్బే ఇచ్చింది. ఇప్పుడు వీటన్నింటి కంటే టాక్సిక్ నష్టం ఎక్కువగా ఉండొచ్చనే రిపోర్ట్స్ రావడమే షాకింగ్ పాయింట్. యశ్‌కు కేజీఎఫ్ తర్వాత వచ్చిన సినిమా కావడంతో బిజినెస్ కూడా అదే స్థాయిలో ప్లాన్ చేశారు. మొదటి రోజు వచ్చిన భారీ ఓపెనింగ్‌తో ఆ లెక్కలు సెట్ అవుతాయనిపించింది. కానీ తర్వాత కలెక్షన్స్ పడిపోవడం, ఓటీటీ డీల్ కూడా తగ్గిపోవడంతో ఇప్పుడు రూ.300 కోట్ల నష్టం అనే నంబర్ బయటకు వచ్చింది.

# చిరు కూతురు 'అమ్ములు'గా అనశ్వర.. 'కాకా' నుంచి ఫస్ట్ లుక్ విడుదల

మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటిస్తున్న భారీ చిత్రం 'కాకా' నుంచి కీలక అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలో చిరంజీవి కూతురిగా నటిస్తున్న మలయాళ నటి అనశ్వర రాజన్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. నేడు ఆమె పుట్టినరోజు సందర్భంగా 'అమ్ములు' పాత్రను పరిచయం చేస్తూ ఈ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. విడుదలైన పోస్టర్‌లో అనశ్వర రాజన్ మెడికల్ కాలేజీ విద్యార్థినిగా అమాయకమైన లుక్‌లో ఆకట్టుకుంటున్నారు. ఆమె నవ్వుతూ కనిపిస్తుండగా, వెనుక రక్షణ కవచంలా మెగాస్టార్ చిరంజీవి నీడ కనిపిస్తోంది. ఈ పోస్టర్ కూతురి జీవితంలో తండ్రి ప్రాముఖ్యతను, వారి మధ్య ఉండే బలమైన అనుబంధాన్ని తెలియజేసేలా ఉంది. సినిమాలో ఆమె పాత్ర కథాగమనంలో చాలా కీలకమని చిత్ర యూనిట్ పేర్కొంది. తన సహజ నటనతో మలయాళంలో మంచి గుర్తింపు తెచ్చుకున్న అనశ్వర రాజన్, 'ఛాంపియన్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. ఇప్పుడు ఏకంగా మెగాస్టార్ సినిమాలో అత్యంత ముఖ్యమైన పాత్రను దక్కించుకోవడం ఆమె కెరీర్‌కు పెద్ద ప్లస్ కానుంది. బాబీ కొల్లి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో కీలక సన్నివేశాల చిత్రీకరణ వేగంగా జరుగుతోంది. తండ్రీకూతుళ్ల భావోద్వేగాలతో పాటు మాస్ యాక్షన్ అంశాలతో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఈ చిత్రాన్ని 2027 జనవరి 13న సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ఇప్పటికే ప్రకటించారు.




PRINTED, PUBLISHED & OWNED By Rolla Raghunath Reddy, PRINTED at Teja Cards & Stationery (Printing & Stationery Supplyers) #78-1-26, Thunnuguntla Vari Street Lalapeta, Guntur - 522001.
EDITOR : Rolla Raghunath Reddy, #4-6-13, Library Road, Koritipadu 1st Lane, Near RCM School, Chandramoulinagar Guntur - 522007. Andhra Pradesh. E-mail: bharathprathinidhi@gmail.com Phone No: 8121214342